మంగళవారం 3 సెప్టెంబర్ 2024
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



# ప్రాణనష్టం - నివారించాం






- ఒకవైపు వరద నియంత్రణకు చర్యలు..
- మరోవైపు బాధితులకు సహాయ కార్యక్రమాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేటే సెక్రటేరియట్‌గా..
- సీఎస్ నుంచి సీఎం వరకూ ఇక్కడే ఉన్నాం
- 32మంది ఐఏఎస్‌లకు 32 డివిజన్ల బాధ్యతలు
- చివరి మైలు వరకూ ఆహారం అందించేందుకు కృషి
- అందుకు.. డ్రోన్లను రంగంలోకి దించాం
- సమర్థ సేవలందించాలని అధికారులకు ఆదేశాలు
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి

2 లో

## ఈ సమయంలో మొద్దునిద్రా?

- నేనే స్వయంగా రంగంలోకి దిగినా మారరా..
- ఆహార పంపిణీ జాప్యంపై ముఖ్యమంత్రి సీరియస్
- నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై మండిపాటు
- జగన్ భక్త అధికారులపై చంద్రబాబు ఆరా?
- ఆహార పంపిణీ జాప్యంపై నివేదిక కోరిక సీఎం
- రెండు రోజులకు సరిపడా ఏర్పాట్లకు ఆదేశం

- వివరాలు 3 లో..

## వరదకు ఎదురెళ్లి..!!



- తెల్లవారుజాము వరకు వరద ప్రాంతాల్లోనే సీఎం
- నేనున్నానంటూ ధైర్యం చెబుతూ సాగిన పైనం
- ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు విస్తృత పర్యటన

- వివరాలు 4 లో..



## 'దివీస్' ఔదార్యం

- రూ.2.5 కోట్లతో ముంపు బాధితులకు ఆహారం
- 1.70 లక్షల మందికి ఐదు రోజులపాటు అందిస్తామని వెల్లడి

7



## ప్రభుత్వం ఏం చేయాలో అదే చేస్తోంది

- నారా భువనేశ్వరి

7



## సహాయక చర్యల్లో పాల్గొనండి

- పార్టీ నేతలు, శ్రేణులకు మంత్రి లోకేష్ పిలుపు

7

## వరద సహాయ చర్యలపై నిరంతర పర్యవేక్షణ

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే మంత్రి లోకేష్



- 81 పునరావాస శిబిరాల ఏర్పాటు
- వేలాదిమంది తరలింపు
- హెలికాప్టర్ల ద్వారా ఆహారం, తాగునీరు అందజేత
- ఆహారం, నీరు పంపిణీకి డ్రోన్ల వినియోగం
- విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు

- వివరాలు 5 లో..

## శాంతిస్తున్న కృష్ణమ్మ!



- తగ్గుముఖం పట్టిన ఉగ్రవరద ఉధృతి
- క్రైసిస్ మేనేజ్‌మెంట్‌లో సర్కారు సక్సెస్
- 48 గంటలపాటు వరదప్రాంతాల్లోనే సీఎం
- ప్రభావిత ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు
- సహాయక చర్యలపై అనుక్షణం సమీక్షలు
- ఫలించిన చంద్రబాబు సత్వర చర్యలు
- పునరావాస కేంద్రాలకు తరలుతున్న బాధితులు
- క్రమంగా తేరుకుంటున్న వరద ప్రాంతాలు

12 లో

## ముందుండి నడిపించిన సీఎం చంద్రబాబు



ముమ్మరంగా సహాయ చర్యలు - మంత్రి పయ్యావుల

- వివరాలు 9 లో..

## కృష్ణాకు పెరుగుతున్న వరద..

తీరంలో రైతుల్ని అప్రమత్తం చేయండి



- అధికారులతో సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు
- విజయవాడ ముంపు ప్రాంతాల్లో మంత్రి పర్యటన

- వివరాలు 10 లో..

## ప్రజా రాజధాని అమరావతి సురక్షితమే

- వైసీపీ నీలి మీడియా వార్తలను నమ్మొద్దు
- రాజధాని ప్రాంతంలో పర్యటించిన టీడీపీ నిజనిర్ధారణ కమిటీ

- వివరాలు 5 లో..

చైతన్యరథం

# ప్రాణనష్టం నివారించాం

- ఒకవైపు వరద నియంత్రణకు చర్యలు..
- మరోవైపు బాధితులకు సహాయ కార్యక్రమాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేటే సెక్రటేరియట్‌గా..
- సీఎస్ నుంచి సీఎం వరకూ ఇక్కడే ఉన్నాం
- 32మంది ఐఏఎస్‌లకు 32 డివిజన్ల బాధ్యతలు
- చివరి మైలు వరకూ ఆహారం అందించేందుకు కృషి
- అందుకు.. డ్రోన్లను రంగంలోకి దించాం
- సమర్థ సేవలందించాలని అధికారులకు ఆదేశాలు
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి



అమరావతి (చైతన్య రథం): ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ నష్టం లేకుండా చూసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి కావాల్సిన నిత్యావసరాలను అందించి నట్టు చెప్పారు. రెండో రోజూ సోమవారం ముఖ్య మంత్రి చంద్రబాబు విజయవాడలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందనే భరోసా కల్పిస్తూ క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్నే కార్యస్థానంగా చేసుకొని అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. వారికి మార్గనిర్దేశనం చేస్తూ అలుపెరగకుండా బాధితులకు ఎంతచేయాలో అంతాచేస్తూ మనోధైర్యం కల్పించారు. సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో చివరిసారిగా మంత్రులు, ఉన్నతాధికారులు, యంత్రాం గంతో వరద పరిస్థితిపై సమీక్షించిన చంద్రబాబు, అనంతరం అక్కడినుంచే మీడియాతో మాట్లాడారు.

'చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రకాశం బ్యారేజీకి దాదాపు 11.45 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. 2009లో తొలిసారి ప్రకాశం బ్యారేజీకి 10.9 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన రికార్డు ఉంది. విజయవాడ సింగ్‌నగర్ పూర్తిగా మునిగిపోయేందుకు బుడమేరుకు గండి పడటమే ప్రధాన కారణం. గత ఐదేళ్లలో గండి పూడ్చే పనులు జరగకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చింది. చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ప్రకాశం బ్యారేజీ వద్ద రికార్డు స్థాయిలో వరద సమోదైంది. ప్రకాశం బ్యారేజీ గేట్లు 11.95 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునే విధంగా రూపొందిస్తే.. 11.43 లక్షల క్యూసెక్కుల వరద రావటం చరిత్రలో ఎప్పుడూ లేదు. వరదను నియంత్రించేందుకు సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. పునరావాసం, ఆహార సరఫరాను ప్రజలకు అందిస్తున్నారు. వరదల నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టింది.

ప్రజల సమస్యలు చూస్తుంటే చాలా బాధగా అనిపిస్తుంది. వరద బాధితులకు ఆహార ప్యాకెట్లను అందించేందుకు ప్రస్తుతం బోట్లనే వినియోగిస్తున్నాం. ఇటువంటి సందర్భాల్లో ప్రజల ప్రాణాలు చాలా ముఖ్యం. ఈ కష్ట సమయంలో ప్రతి ఒక్కరూ సహాయం చేయాలి. చివరి ప్రాంతాలకు ఇంకా సహాయక చర్యలు చేరలేకపోవడం బాధగా ఉంది. ఎంత ప్రయత్నించినా చివరి ప్రాంతాలకు సహాయం అందించలేకపోయాం. ఆహార పొట్లాలను వరద నీటిలో లాక్కుపోయే ఘటనలు చూసి చలించిపోయి డ్రోన్ టెక్నాలజీని వినియోగించాం. మొత్తంగా 32 డివిజన్లలో 32 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు పెట్టాం. ముంపు పరిధిలో ఉన్న 179 సచివాలయాలకు 179 మంది ఇన్‌చార్జిలను నియమించాం.

కృష్ణలంకలో తెదేపా ప్రభుత్వ హయాంలో 18 అడుగుల మేర రిటైనింగ్ వాల్‌కట్టాం. తర్వాత 14 అడుగులు కట్టారు. ఈ 14 అడుగులను దాటి కృష్ణ లంకలోకి నీళ్లు వచ్చాయి. ఇది ఊహించని పరిణామమని చంద్రబాబు అన్నారు. భవానీపురంలోకి వచ్చే నీళ్లుతగ్గాయి. కృష్ణలంకలోనూ నియంత్రణలోకి వస్తోంది. సింగ్‌నగర్‌లో నిన్నటికంటే అడుగున్నర మేర నీళ్లు తగ్గాయి. నిన్న సాయంత్రం నుంచి అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

మంగళవారం ఆరు హెలికాప్టర్లు పనిచేస్తాయి. వినూత్నంగా ఈ రోజు ఎనిమిది డ్రోన్లు పెట్టి 10 వేల మందికి ఆహార ప్యాకెట్లను అందచేయగలిగాం. ఆహారం కలుషితం కాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకొని సురక్షితంగా డ్రోన్ల ద్వారా ప్యాకెట్లను అందిస్తున్నాం. రేపు 30నుంచి 35 డ్రోన్లను పెడతాం. ఈ ప్రక్రియ విజయవంతమైతే మరిన్ని డ్రోన్లను రంగంలోకి దించుతాం. ప్రతి బోట్‌లోనూ వాహనం లోనూ ఆక్టోపస్, గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌ను పెట్టాం. లోడింగ్, అన్‌లోడింగ్‌లో ఇబ్బందులు రాకుండా ఏపీఎస్‌పీ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించు కుంటున్నాం. ఇక ఇప్పటినుంచే పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది. బాధితులందరినీ ఆదుకున్నాకే ఇక్కడి నుంచి కదులుతాం.

1996-97లో హరికేన్ తుపాను సమయంలో రాజమండ్రి ఆర్‌డీవో ఆఫీసును సెక్రటేరియట్‌గా చేసుకొని అందరు సెక్రటరీలను రమ్మని వారంలో పనులు పూర్తిచేసి పరిస్థితిని చక్కదిద్దాకే హైదరాబాద్ వెళ్లాను. హుద్‌హుద్ సమయంలో విశాఖలోనే ఉండి అసాధ్యమనుకున్నదాన్ని సుసాధ్యం చేశాం. తిత్లీ సమయంలోనూ పండగలను పక్కనపెట్టి అక్కడే ఉండి సాయమందించాం.

బుడమేరుకు గేట్లు ఉన్నాయని మాట్లాడే వ్యక్తి ఎలా ముఖ్యమంత్రి అయ్యారో నాకైతే తెలియడం లేదు. నా ఇంటిని కాపాడేందుకు బుడమేరుకు నీరు పంపించానని అజ్ఞానం, విచ్చలవిడితనంతో జగన్ మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు రాష్ట్రంపట్ల బాధ్యత లేకపోవచ్చు కానీ నాకు పూర్తిస్థాయి బాధ్యత ఉంది.

నాడు రెడ్ కార్పెట్ వేసుకొని వరద నీటిలో తిరిగిన వ్యక్తి ఇవాళ గతిలేక బురదలో దిగారు. అందరి ఇళ్లకూ వరద నీరు వచ్చినట్టే నా ఇంటికీ వచ్చింది. మరో 3 రోజులపాటు ఎక్కడా రాజీ పడకుండా, విశ్రాంతి లేకుండా సహాయక కార్యక్రమాలు కొనసాగిస్తాం. ప్రజలను ఆదుకోవడం ఓ గురుతర బాధ్యతగా తీసుకున్నాం" అని చంద్రబాబు వివరించారు.



# ఈ సమయంలో మొద్దునిద్రా?

- నేనే స్వయంగా రంగంలోకి దిగినా మారరా..
- ఆహార పంపిణీ జాప్యంపై ముఖ్యమంత్రి సీరియస్
- నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై మండిపాటు
- జగన్ భక్త అధికారులపై చంద్రబాబు ఆరా?
- ఆహార పంపిణీ జాప్యంపై నివేదిక కోరిక సీఎం
- రెండు రోజులకు సరిపడా ఏర్పాట్లకు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): కృష్ణమ్మ ఉగ్రవరదలో చిక్కుకున్న లోతట్టుప్రాంతాల ప్రజలను రక్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు క్షణకాలం విశ్రమించకుండా పరుగులు పెడుతున్నారు. యుద్ధప్రాతిపదికన సాగుతోన్న సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే.. ముంపునకుగురైన ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి ప్రజలకు ధైర్యం చెబుతూనే ఉన్నారు. ఆకలితో అలమటిస్తున్న వరద బాధితులకు ఆహార పొట్లాలు అందుతున్నాయో లేదో అనుక్షణం పరిశీలిస్తూ.. అధికార యంత్రాంగాన్నీ పరుగులు పెట్టిస్తున్నారు. సోమవారం తెల్లవారుఝాము వరకూ వరద ప్రాంతాల్లో పర్యటించి చీకట్లో చిక్కుకున్న ముంపు ప్రాంత ప్రజలకు ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి.. సోమవారం ఉదయం నుంచే కర్తవ్య నిర్వహణకు సిద్ధమవ్వడంతో వరద బాధితులే విస్మయం వ్యక్తం చేశారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన అనంతరం సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. సహాయక చర్యల్లో కొందరు అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. గత ప్రభుత్వంలోని అలసత్వం వదిలించుకోకుంటే సహించేది లేదంటూ తీవ్ర స్వరంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. సహాయక చర్యల విషయంలో ఇప్పటికీ కొందరు అధికారులు నిర్లక్ష్యం వీడలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. అధికారుల పనితీరు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ఉండాలని కఠిన స్వరంతోనే సూచించారు. స్వయంగా తానే రంగంలోకి దిగినా.. అధికార యంత్రాగం మొద్దునిద్ర వీడకపోతే ఎలా అంటూ క్లాస్ పీకారు. అనుకున్న స్థాయిలో ఆహారం తెప్పించగలిగినా.. పంపిణీ విషయంలో జాప్యంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

బుడమేరు ముంపు ప్రాంతాల్లో డ్యూటీలోవున్న కొందరు ఉన్నతాధికారుల కారణంగా ఆహారం పంపిణీలో జాప్యం జరిగిందని ఓ మంత్రి సమీక్షలో భాగంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నాడు జగన్ భక్త అధికారులుగా ముద్రపడి, వైకాపాతో అంటకాగిన కొందరు అధికారులు డ్యూటీలోవున్నచోట ఈ సమస్య తీవ్రంగా ఉందని మంత్రి తెలపడంతో.. ముఖ్యమంత్రి ఆగ్రహం తారాస్థాయికి చేరింది. పంపిణీ సక్రమంగా, వేగంగా జరగకుండా ఉద్దేశపూర్వకంగానే ఆ అధికారులు వ్యవహరిస్తున్న విషయాన్ని గుర్తించినట్లు మంత్రి సీఎంకు వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో స్వయంగా తన పరిశీలనకు వచ్చిన అంశాలను రాసుకొని వచ్చి మరీ వివరించారు. వీఆర్‌లో ఉండి వరద బాధిత ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు డీఎస్పీ నుంచి డీఐజీ స్థాయి అధికారులు కొందరు వచ్చారనీ.. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే ఉద్దేశంతో వారు సహాయ చర్యలను నిర్లక్ష్యం చేస్తూ ఆటంకాలు కల్పిస్తున్నారని సీఎం సమీక్షలో చర్చ జరిగినట్టు తెలుస్తోంది. వివిధ వ్యవహారాల్లో ఆరోపణలతో ప్రస్తుతం వీఆర్‌లోవున్న కొల్లి రఘురామిరెడ్డి, విజయారావు, రఘువీరారెడ్డి, శ్రీకాంత్, సత్యానంద్, గోపాలకృష్ణ వంటి కొందరు అధికారులు అక్కడ డ్యూటీలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. మంత్రి చెప్పిన సమాచారాన్ని తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి.. ఆయా అధికారులు డ్యూటీలో వున్న ప్రాంతంలో ఆహారం పంపిణీలో నెలకొన్న జాప్యంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అయితే, వీఆర్‌లోవున్న ఆ అధికారులను బందోబస్తులో భాగంగా అక్కడ విధుల్లో నియమించినట్లు ఉన్నతాధికారులు సీఎంకు తెలిపారు. పని చేయడం ఇష్టం లేకపోతే ఉద్యోగాలు వదిలేసి ఇంటికి వెళ్లాలని.. ప్రజలు బాధల్లోవున్న సమయంలో ఇలాంటి పోకడలను సహించేది లేదని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా తేల్చి చెప్పినట్టు సమాచారం. ఆహార పంపిణీలో మరింత సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి కొంత కఠిన స్వరంతోనే సూచించినట్టు తెలుస్తోంది. సాయంత్రంలోగా పొరుగు జిల్లాల అధికారులతో మాట్లాడి మరో 3 లక్షల ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు తెప్పించాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం సూచించారు. వరద బాధితుల సహాయ చర్యలను పర్యవేక్షించేందుకు వార్డుకు ఒక సీనియర్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. వరద బాధితులకు పండ్లు అందజేసే విషయంలోవున్న అన్ని అవకాశాలనూ పరిశీలించాలన్నారు. వివిధ ప్రాంతాలనుంచి పండ్లు తెప్పిస్తున్నట్లు సీఎంకు అధికారులు వివరించారు.

### రెండుమూడు రోజులకు ఏర్పాట్లు..

మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం నిర్వహించిన సమీక్షలో విధుల్లోవున్న హెలికాప్టర్ ద్వారా అందుతున్న సాయంపై ఆరా తీశారు. మిగిలిన హెలికాప్టర్లనూ వీలైనంత త్వరగా రప్పించాలని ఆదేశించారు. ఆహార పంపిణీ ఎంతమేరకు పంపిణీ చేశారో డివిజన్ల వారీగా అడిగి తెలుసుకున్న సీఎం, ఇతర జిల్లాల్లో తయారుచేసి తరలిస్తున్న ఆహారంపైనా ఆరా తీశారు. పునరావాస కేంద్రాలకు వచ్చే వారికి దుస్తులు సిద్ధంగా ఉంచాలని, బాధితుల సెల్‌ఫోన్ ఛార్జింగ్ కోసం పవర్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమ్యునికేషన్‌లో అంతరాయం ఏర్పడకుండా చూడాలన్న సీఎం, రానున్న రెండురోజుల్లో బాధితులకు అందించేందుకు కూరగాయలు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమస్యను రెండుమూడు రోజులపాటు ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికార యంత్రాంగానికి సూచించారు.

### ఫలించిన ముఖ్యమంత్రి ప్రయత్నాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించిన తీరుతో విజయవాడకు పవర్‌బోట్లు చేరుకున్నాయి. ఆదివారం వరద పరిస్థితిని సమీక్షిస్తూనే.. కేంద్రంతో చంద్రబాబు మాట్లాడటం తెలిసిందే. ముంపు ప్రాంతాల పరిస్థితిని వివరించటంతో.. వివిధ రాష్ట్రాల నుంచి విజయవాడకు బోట్లు చేరుకున్నాయి. బోట్ల సాయంతో సింగ్‌నగర్ ముంపు ప్రాంతంలో ఆహార పంపిణీ సులువుగా సాగింది. పెద్దఎత్తున బోట్లు రావడంతో ఇళ్లనుంచి బాధితులను బయటకు తెచ్చే పనులు వేగవంతమయ్యాయి. పునరావాస కేంద్రాలకు వెళ్లే వాళ్లకు దుస్తులు కూడా ఇవ్వాలన్న సీఎం ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాల ప్యాకెట్లు, ఆహారం, నీళ్ళ బాటిళ్లను అందించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. దీంతో తీవ్ర పరిస్థితినుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో గట్టెక్కినట్టే కనిపిస్తోంది. సీఎం సూచనలతో, క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రభుత్వ యంత్రాంగం పరుగులు పెడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు, యుద్ధప్రాతిపదిక చర్యలతో వరద ముంపు ప్రాంతాల్లో ఒకింత రిలీఫ్ కనిపిస్తోంది.

# వరద ఉధృతిని పరిశీలించిన సీఎం

- ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రవాహ పరిశీలన
- హెల్ప్ లైన్ నంబర్లు ఇవే..

విజయవాడ (చైతన్య రథం): కృష్ణానదీ ప్రవాహ ఉధృతిని ప్రకాశం బ్యారేజ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. బ్యారేజ్ గేట్లను పడవలు ఢీకొట్టిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. గేట్ల మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యారేజ్ పరిశీలనకు వచ్చారన్న సమాచారంతో భారీ సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకున్నారు.

### హెల్ప్ లైన్ నంబర్లు ఇవే..

విజయవాడలో వరద బాధితులకు సాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేశారు. బాధితులు.. 8181960909, 0866-2424172, 0866-2575833, 18004256029 నెంబర్లకు కాల్ చేసి తమ ఇబ్బందులను తెలపవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

### డ్రోన్లతో ఆహారం పంపిణీ..
### 81 పునరావాస శిబిరాలు

సింగ్‌నగర్ ప్రాంతంలో వరద బాధితులకు డ్రోన్లతో ఆహార పంపిణీ సత్ఫలితాలనిస్తోంది. వరద సహాయ చర్యలపై విభాగాల వారీగా అధికారులకు మంత్రి నారా లోకేష్ బాధ్యతలు అప్పగిందారు. అధికారులకు అప్పగించిన బాధ్యతను ఏమేరకు పూర్తి చేశారన్న విషయమై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వరద బాధితుల కోసం ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా 81 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. వరద ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా మెడికల్ టీములు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి కృష్ణబాబుకు సూచించారు.

### బాధితులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు

పవర్‌బోట్లు సాయంతో ముంపు ప్రాంతం నుంచి బయటకు వచ్చిన సింగ్‌నగర్ వాసులతో సోమవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. సీఎంను కలిసిన వెంటనే బాధితులు ఒక్కసారిగా తమ కష్టాలు మొరపెట్టుకుని బోరుమన్నారు. రెండు రోజులుగా పడుతున్న కష్టాలను సీఎంకు వెళ్లబోసుకున్న బాధితులు, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకుంటే మరిన్ని ఇబ్బందులు పడేవాళ్లమని గోడు వెళ్లబోసుకున్నారు. ఊహించని ఉత్పాతం వల్ల పడిన ఇబ్బందులను సీఎంకు వివరించారు. ఇప్పటికీ బంధువులు, ఇరుగుపొరుగు వారు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నారని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. నేటి ఉదయం నుండి నీళ్లు, ఆహారం అందిందని, ఎన్డీఆర్ఎఫ్ బోట్ల ద్వారా బయటకు రాగలిగామని సీఎంకు వివరించారు. చుట్టుముట్టిన వరద నీటితో తాము ప్రాణాలతో బయటపెడతామని అనుకోలేదని పలువురు మహిళలు రోధిస్తూ చెప్పారు. వరద ప్రాంతాల నుండి బటయకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులను అంబులెన్స్‌లో తరలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాట్లు చేశారు. రెండు రోజులుగా నిరంతరం శ్రమిస్తూ ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుని వరద సహాయక చర్యలు చేపట్టామని సీఎం బాధితులకు వివరించారు. వందల మంది వరదబాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పిన సీఎం, పసిపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు వరద నీటిలో చిక్కుకుని పడిన ఇబ్బందులు తనను ఎంతో ఆవేదనకు గురి చేశాయన్నారు. ప్రతి ఒక్కరూ మళ్లీ సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ.. ఆస్తులు కోల్పోయిన వారికి, అనారోగ్యంతో ఉన్నవారికి ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తామని సీఎం ఈ సందర్భంగా భరోసానిచ్చారు.



# వరదకు ఎదురెళ్లి..!!

- తెల్లవారుజాము వరకు వరద ప్రాంతాల్లోనే సీఎం
- నేనున్నానంటూ ధైర్యం చెబుతూ సాగిన వైనం
- ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు విస్తృత పర్యటన



అమరావతి (చైతన్య రథం): కుండపోత వర్షాల నేపథ్యం, కృష్ణమ్మ వరద ఉగ్రరూపం నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముంపుప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటనలు జరుపుతూనే ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆయన నిర్విరామంగా సుడిగాలి పర్యటనలు చేస్తూ.. సోమవారం తెల్లవారు జాము 4 గంటల వరకు వరద ప్రాంతాల్లోనే ఉన్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను సమీక్షిస్తూనే.. మరోపక్క అధికారులకు ఆదేశాలిస్తూ.. లోతట్టు ప్రాంతాల్లో వరదలో ఇరుక్కున్న ప్రతి వ్యక్తినీ కలుస్తూ ధైర్యం చెప్పారు. అజిత్‌సింగ్ నగర్, కృష్ణలంక, ఇబ్రహీంపట్నం, ఫెర్రీ, జూపూడి, మూలపాడు ప్రాంతాల్లో చంద్రబాబు విస్తృతంగా పర్యటించారు. జూపూడి, మూలపాడులో ఇళ్లలోకి నీళ్లు వచ్చి చేరడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో బాధితుల వద్దకు వెళ్లి సీఎం సమస్యలు తెలుసుకున్నారు.

విపత్తును దీటుగా ఎదుర్కొనే విషయంలో ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా చంద్రబాబు కోరారు. ఇబ్బందులుంటే ప్రభుత్వం ప్రకటించిన టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఎవరూ అధైర్య పడొద్దని.. అండగా ఉంటానని బాధితులకు భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. నిర్విరామ పర్యటన అనంతరం సీఎం చంద్రబాబు ఉదయం 4 గంటల సమయంలో విజయవాడ కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన బస్సులో విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లారు. తిరిగి ఉదయం 10 గంటలకే సిద్ధమైన చంద్రబాబు.. వరద పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని.. మళ్లీ బాధితుల వద్దకు వెళ్లారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు అలుపెరగకుండా పర్యటించనున్నారు.

### ప్రైవేటు హోటల్స్ యజమానులతో మాట్లాడిన సీఎం

వరద బాధితులకు అందించేందుకు దుర్గ గుడి ద్వారా ఆహారం తయారు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ విషయంపై ఆలయ అధికారులను పిలిచి ఆయన మాట్లాడారు. 50 వేల మందికి పులిహోర సిద్ధం చేయాలన్నారు. మరోవైపు విజయవాడలోని ప్రైవేటు హోటల్స్ యజమానులతో ఆయన మాట్లాడారు. ఉదయంలోగా లక్షమందికి ఆహారం సిద్ధం చేయాలని చంద్రబాబు సూచించారు.

### విజయవాడ కలెక్టరేటే సెక్రటేరియట్‌గా..

విజయవాడ కలెక్టరేట్‌ను సెక్రటరియేట్‌గా మార్చుకొని వరద సహాయక చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరదల్లో చిక్కుకున్న బాధితులకు ఆహారం, త్రాగునీరు సరఫరా చేయడంలో ప్రభుత్వం సఫలీకృతమైంది. 3 లక్షల ఆహార పొట్లాలు పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం, సింగ్‌నగర్, జక్కంపూడి, శ్రీనగర్, శారదా సెంటర్, కృష్ణలంక, మిల్క్ ఫ్యాక్టరీ, రాజరాజేశ్వరీపేట తదితర ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న వారందరికీ ఉదయం అల్పాహారం అందచేయగలిగింది.



## పునరావాసాలపై దృష్టిపెట్టండి

- ఒక్క రాత్రి ధైర్యంగా ఉండమని మాటిచ్చా..
- హామీ నిలబెట్టుకునే దిశగా పనిచేయాలి
- అందరినీ భద్రంగా బయటకు తేవాలి
- వసతిగా కళ్యాణ మండపాలు సిద్ధం చేయండి
- ఏ ఇతర కేంద్రాలున్నా ఫరవాలేదు...
- మొదటి సమీక్షలో అధికారులకు సీఎం ఆదేశం

అమరావతి: ప్రజలను రక్షించే విషయంలో ప్రభుత్వ ప్రయత్నాలు ఎక్కడా ఆగకూడదని ఏపీ సీఎం చంద్ర బాబు స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై సోమవారం ఉదయం విజయవాడ కలెక్టరేట్‌లో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఒక్క రాత్రి ధైర్యంగా ఉండాలని ఆదివారం రాత్రి ముంపు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చానని సీఎం చంద్రబాబు అధికారు ల దృష్టికి తెచ్చారు. ఆహామీ నిలబెట్టు కునే దిశగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని సూచించారు. తీవ్రవరద పరిస్థితులను అధిగమించి ఎంత మంది ని రక్షించామన్నదే మన లక్ష్యం కావాల న్నారు. బోట్లు కూడా కొట్టుకు పోయే సవాళ్లు ముందున్నాయని అంటూనే.. బోట్లలో బయటకు తీసు కొచ్చినవారిని పునరావాస ప్రాంతాలకు తరలించేం దుకు బస్సులు సిద్ధంగా ఉంచాల న్నారు. అవసరమైతే వృద్ధులు, రోగులు ఇబ్బంది పడకుండా హోటళ్ల లోనే ఉంచాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆదేశించారు. బాధితుల పునరావాసం కోసం కల్యాణ మండపాలు, ఇతర కేంద్రాలు సిద్ధం చేయాలన్నారు. మొత్తం 47 కేంద్రాలు గుర్తించినట్టు సీఎంకు అధికారులు నివేదించారు.

### నాతో సహా అందరూ బృందాలుగా ఏర్పడాలి

ఆదివారం అర్ధరాత్రే అగమేఘాల మీద సిద్ధం చేసిన ఆహారాన్ని ఉదయం 8 గంటలకల్లా ఎంతమందికి అందించారని సీఎం ఆరా తీశారు. సుమారు లక్షన్నర మంది వరకు ఆహార పంపిణీ జరిగిందని అధికారులు వివరించారు. విపత్తు సమయంలో వరద బాధితులు తీసుకునే తాగునీరు ఎంతో ముఖ్యమని చంద్రబాబు చెప్పా రు. అందుబాటులో ఉన్న మినరల్ వాటర్‌వారి కోసమే కేటాయించాలన్నా రు. కృష్ణానది కరకట్టపై వెంకటపాలెం వద్ద గండి పడే పరిస్థితిపై సీఎం ఆరా తీశారు.గండిని పూడ్చగలిగామని సీఎం కు అధికారులు వివరించారు. రాజ ధాని రైతులు స్వచ్ఛందంగా చూపిన చొరవను ముఖ్యమంత్రి అభినందించా రు. కరకట్టవెంట గండి పడే ప్రాంతాల గుర్తింపునకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలన్నారు. తనతోసహా అధికారు లంతా బృందంగా ఏర్పడాలని స్పష్టం చేశారు.

### సింగనగర్‌లో సీఎం పర్యటన..

విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. జోరు వర్షంలో బోటు ఎక్కి సింగ్‌నగర్ లోపలికి వెళ్లారు. దాదాపు వంతెనకు అనుకుని ప్రవహిస్తున్న వరద నీటిని సీఎం పరిశీలించారు. బాధితులకు ఉదయమే ఆహారం అందిందా? లేదా? అని చంద్రబాబు ఆరా తీశారు. ఆహారం, రక్షిత మంచి నీరు అందాయని బాధితులు ఆయనకు తెలిపారు.

## మోకాలి లోతు నీటిలో..



- వరద నీటిలోనే సీఎం కాలినడక
- 4 గంటలపాటు నిర్విరామ పర్యటన
- ప్రజలను త్వరగా కాపాడాలని ఆదేశాలు
- ముంపుప్రాంతాల్లో పదేపదే పర్యటనలు
- బాధితులకు ధైర్యం చెప్పిన చంద్రబాబు
- బోట్లను మ్యాపింగ్ చేయాలంటూ ఆదేశం

అమరావతి (చైతన్యరథం): నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్ర బాబు విస్తృతంగా పర్యటించారు. సోమ వారం ఉదయం నుంచి ముంపు ప్రాంతా ల్లో సుమారు నాలుగు గంటలపాటు నిర్వి రామంగా పర్యటించారు. యనమలకు దురు, పటమట, రామలింగేశ్వరనగర్, జక్కంపూడి, భవానీపురం తదితర ప్రాంతా ల్లో సీఎం పర్యటించి బాధితులతో మాట్లా డారు. ప్రకాశం బ్యారేజీ దిగువ లోతట్టు ప్రాంతాలు, ఎగువ ప్రాంతాల్లోనూ పర్యటిం చారు. వాహనం వెళ్లగలిగినంత దూరం అందులో.. మిగిలినచోట్ల కాలినడక వరద నీటిలోనే ప్రయాణం చేశారు. కొన్నిచోట్ల మోకాలి లోతు నీటిలోనూ నడుచుకుంటూ వెళ్లారు. బురదలో కాలినడకనే తన పర్యటనను కొనసాగించారు. మరింత ఎక్కువ నీరున్న ప్రాంతాల్లో బోటు ద్వారా బాధితుల వద్దకు చేరుకుని వారితో స్వయంగా మాట్లాడి కష్టాలు తెలుసుకు న్నారు. బాధితులు చెప్పే ఫిర్యాదుల పరి ష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం ఆదు కుంటుందని.. ధైర్యంగా ఉండాలంటూ ప్రజల్లో భరోసా కల్పించారు.

### విపత్తు నుంచి ప్రజలను త్వరగా కాపాడాలి

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన ముగిసిన అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లో మంత్రులు, అధికారులతో సీఎం మరోసారి సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యల్లో వేగంపెంచి ప్రజలకు భరోసా ఇచ్చామన్నారు. ఊహించని విపత్తు నుంచి ప్రజలను త్వరగా కాపాడాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత తమ బాధ్యతని, బాధితులు ధైర్యంగా ఉండాలని కోరారు. వరద పరిస్థితిపై సోమవారం ఒక్కరోజే సీఎం చంద్రబాబు మూడుసార్లు సమీక్షలు నిర్వహించారు.

### కృష్ణలంక ప్రాంతంలో మరోసారి..

నగరంలోని వరద ప్రభావిత ప్రాంతా ల్లో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్య టిస్తున్నారు. ఉదయం అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం.. తర్వాత సింగ్‌నగర్ ప్రాంతానికి వెళ్లారు. బోటులో సహాయ కార్యక్రమాలను పర్య వేక్షించారు. అనంతరం కలెక్టరేట్‌కు వచ్చి సమీక్ష నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తర్వాత మరోసారి కృష్ణలంక, జక్కంపూడి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులతో మాట్లాడి ప్రభుత్వం తరపున చేపట్టిన పున రావాస కార్యక్రమాలు, ఆహార పంపిణీపై సీఎం ఆరా తీశారు.

### బోట్లు మ్యాపింగ్ ముఖ్యం: సీఎం

హెలికాప్టర్ల ద్వారా వరద బాధితులకు ఆహారం,నీళ్లు,పాలు అందజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మూడుపూటలా బాధితులకు ఆహారం అందాలన్నారు. చిన్నారులు, గర్భిణులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. బోట్లు ఎక్కడెక్కడ తిరుగుతున్నాయో మ్యా పింగ్ చేయాలన్నారు. ఒకే ప్రాంతంలో కాకుండా మారుమూల ప్రాంతాలకు వెళ్లా లని సూచించారు. మధ్యాహ్నం కొంత మేరకు వరద ప్రవాహం తగ్గుతుందని అంచనా వేశారు. లంక గ్రామాల్లో సమ స్యలపై అధికారులను అప్రమత్తం చేయాల ని కలెక్టర్లను ఆదేశించారు. ఎవరూ ఆందో ళన చెందాల్సిన అవసరం లేదని.. అంద రికీ సాయం అందుతుందని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# వరద సహాయ చర్యలపై నిరంతరం పర్యవేక్షణ



## కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే మంత్రి లోకేష్

- 81 పునరావాస శిబిరాల ఏర్పాటు
- వేలాదిమంది తరలింపు
- హెలికాప్టర్ల ద్వారా ఆహారం, తాగునీరు అందజేత
- ఆహారం, నీరు పంపిణీకి డ్రోన్ల వినియోగం
- విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు

అమరావతి (చైతన్యరథం): విజయవాడలో కొనసాగుతున్న వరద సహాయక చర్యలను రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వరద అంచనా, బోట్ ఆపరేషన్, ఆహారం, తాగునీరు పంపిణీ, విద్యుత్ సరఫరాలపై అధికారులతో సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం, 109 బోట్ల ద్వారా ఆహారం, తాగునీటి సరఫరాతో పాటు నిరాశ్రయుల తరలింపు చర్యలు చేపడుతున్నారు. సోమవారం ఉదయం వరకు విజయవాడ నగరంలో వరద ప్రభావిత ప్రాంతాలైన సింగ్ నగర్, రామలింగేశ్వర నగర్ తదితర ముంపు ప్రాంతాల నుండి 15 వేల మందికి పైగా నిరాశ్రయులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద బాధితులకు నగరంలోని ప్రధాన కళ్యాణ మండపాలు, హోటళ్లలో ఆశ్రయం ఏర్పాటు చేశారు. నిరాశ్రయుల కోసం విజయవాడ నగరంలో 78 పునరావాస శిబిరాలు, ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 81 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. భారీ వరద కారణంగా నిలిచిపోయిన సెల్ సిగ్నల్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని 49 ప్రాంతాల్లో 1,39,815 ఇళ్లకు నిలిచిపోయిన విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. సహాయ చర్యలకు సంబంధించి వివిధ ప్రభుత్వ విభాగాధిపతులకు బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు పరిస్థితిని మంత్రి లోకేష్ సమీక్షిస్తున్నారు. డ్రోన్ల సహకారంతో వరద ముంపు ప్రాంతాల్లో సమస్యలను గుర్తిస్తూ పరిస్థితులకు తగ్గట్టుగా అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ



చేస్తున్నారు.

### రంగంలోకి నేవీ హెలికాప్టర్లు

వరద సహాయ చర్యల కోసం నేవీ హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. సోమవారం మధ్యాహ్నం వరకు నేవీ నుండి మూడు హెలికాప్టర్లు వచ్చాయి. హకీంపేట ఎయిర్ బేస్ నుండి మరో నాలుగు హెలికాప్టర్లు వచ్చాయి. వరద ముంపు ప్రాంతాల్లో ఆరు హెలికాప్టర్ల ద్వారా పులిహోర, బిస్కట్లు, మందులు, వాటర్ బాటిళ్లు, సాఫ్ట్ డ్రింక్స్‌లను ఎన్‌డిఆర్ ఎఫ్ బృందాలు జారవిడుస్తున్నాయి. 2,97,500 మందికి ఆహారం, మంచినీరు అందజేశారు. విజయవాడ నగరంలో నీట మునిగిన రవినగర్, వాంబేకాలనీ, జక్కంపూడి ప్రాంతాల్లో ఎంఐ-17 హెలికాప్టర్ ద్వారా 3వేల కిలోలు, ఎఎల్-హెచ్ ద్వారా 2వేల కిలోల ఆహారం, వాటర్ బాటిళ్లు జారవిడిచారు.ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా వరద బాధితులకు ఆహారం, మంచినీరు పంపిణీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 17 చోట్ల తెగిపోయిన రోడ్ల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించారు. ప్రకాశం బ్యారేజీ నుండి ప్రస్తుతం 11,41,276క్యూసెక్కుల నీరు కిందకు వదులుతున్నారు. జగన్ ప్రభుత్వ నిర్వాకం కారణంగా కృష్ణలంక పరిసరాలు నీటమునిగాయి. అక్కడ ఉన్న శ్మశానం ప్రాంతంలో రిటైనింగ్ వాల్ కట్టకుండా గత ప్రభుత్వం వదిలివేయటంతో ఆ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. దీంతో బ్యారేజీ దిగువున ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని మంత్రి లోకేష్ నిరంతరం సమీక్షిస్తున్నారు.

### డ్రోన్ల ద్వారా ఆహారం

వరదముంపునకు గురైన సింగ్ నగర్, జక్కంపూడి, కండ్రిగ, దాబా కొట్ల సెంటర్, లూనా సెంటర్ ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్ల పై అంతస్తుల్లో నివసిస్తున్న వారికి డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070లకు వస్తున్న విన్నపాలపై ఎప్పటికప్పుడు స్పందించేలా మంత్రి లోకేష్ ఏర్పాట్లు చేశారు. ఐవిఆర్ఎస్ ద్వారా వరదబాధిత ప్రాంతాల ప్రజలనుంచి సహాయచర్యలను వాకబు చేస్తున్నారు.

### విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు

వరద సహాయ చర్యలపై విభాగాల వారీగా అధికారులకు మంత్రి నారా లోకేష్ బాధ్యతలు అప్పగించారు. అధికారులకు అప్పగించిన బాధ్యతను ఏమేరకు పూర్తి చేశారన్న విషయమై లోకేష్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వివిధ ప్రాంతాలనుంచి ఆహారాన్ని రప్పించి బాధితులకు చేరవేసే బాధ్యతను సీనియర్ ఐఎఎస్ అధికారి జి.వీరపాండ్యన్‌కు అప్పగించారు.

### పొరుగు జిల్లాల నుంచి ఆహార పొట్లాలు

కాగా పొరుగు జిల్లాలైన బాపట్ల, గుంటూరు, ఏలూరు జిల్లాల నుంచి ఆహార పొట్లాలను పంపించాలని టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో 3.9లక్షల ఆహార పొట్లాలు పంపిణీ చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యాన్ని నిర్దేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా మెడికల్ టీమ్‌లు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి కృష్ణబాబును ముఖ్యమంత్రి ఆదేశించారు.







# ప్రజా రాజధాని అమరావతి సురక్షితమే

- వైసీపీ నీలి మీడియా వార్తలను నమ్మొద్దు
- రాజధాని ప్రాంతంలో పర్యటించిన టీడీపీ నిజనిర్ధారణ కమిటీ

అమరావతి (చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతి జలమయమైందని జగన్ ముఠా, నీలిమిడియా ఫేక్ వీడియోలను సృష్టించి ప్రచారం చేస్తున్న నేపథ్యంలో సోమవారం టీడీపీ నిజనిర్ధారణ కమిటీ రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించింది. టీడీపీ నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, తెలుగురైతు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, కళ్ళం గోవిందరెడ్డి, ఆలూరి ఓంకార్, వాకచర్ల వీరాంజనేయులు, తురకా నరేష్ తదితరులు రాజధాని ప్రాంతంలో కలియ తిరిగారు. పెనమాక, ఉండవల్లి గుహల వద్ద తప్ప మరెక్కడా నీరు నిలవలేదని తెలిపారు. భారీ వర్షాలు, తుఫాన్లు వచ్చినప్పుడు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాలను పోలిస్తే అమరావతి ప్రాంతం అన్నివిధాలా సురక్షితంగా ఉందన్నారు. రాజధాని ప్రాంతంలోని పెనుమాక, ఉండవల్లి గ్రామాల మధ్య నుంచి ప్రవహిస్తున్న



కొండవీడు వాగులోని గుర్రపుడెక్కను గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం తొలగించలేదని, ఫలితంగా నేడు వరద నీరు దిగువకు వెళ్లే పరిస్థితిలేక నిలిచిపోయిందన్నారు. వాగులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, సీల్ట్‌ను తొలగించేందుకు ఎన్డీయే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిందన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా బ్యారేజీకి 11.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినప్పటికీ రాజధాని అమరావతికి ఎలాంటి ప్రమాదం జగరలేదన్నారు. రాజధానిపై వైసీపీ విమర్శలు పచ్చి అబద్ధాలనే విషయం మరోసారి స్పష్టమైందని... వైసీపీ నీలి మీడియా మాటలు ప్రజలు నమ్మొద్దని నిజనిర్ధారణ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ప్రజల్ని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, రైతులు పాల్గొన్నారు.

# అమరావతిపైనా..
# కూతలు.. రోత రాతలు!!

కృష్ణమ్మ ఉగ్ర వరదలో చిక్కుకున్న ప్రజలను కాపాడుకోవడానికి అర్ధరాత్రి, అపరాత్రి అన్నది మర్చిపోయి.. వరదకు ఎదురెళ్లే సాహసం చేస్తున్న ముఖ్యమంత్రి ఒకవైపు. ప్రజలెలాపోతే నాకేంటి?.. పాలక పార్టీపై వరద బురద చల్లడమే తన ధ్యేయమన్నట్టు కనీస మానవత్వాన్ని మరిచిన మాజీ ముఖ్యమంత్రి మరోవైపు. ఇదీ.. ప్రజా రాజధాని అమరావతిలో ఏకకాలంలో కనిపిస్తోన్న భిన్న దృశ్యాలు. చూరుకాలి ఒకడేడుస్తుంటే.. చుట్ట వెలిగించుకోడానికి నిప్పు దొరుకుతుందా? అన్నాడట వెనకటికొకడు. మాజీ సీఎం జగన్ దౌర్భాగ్య రాజకీయం ఈ సామెతకు అద్దంపడుతోంది.



కృష్ణా పరీవాహక ప్రాంతంలో చరిత్రలో కనీవినీ ఎరుగని వర్షపాతం నమోదవ్వడంతో.. కృష్ణమ్మ ఉగ్ర రూపం దాల్చింది. తుపాను కారణంగా రెండు రోజుల భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగి కృష్ణమ్మ గర్భానికి చేరడంతో.. పోటెత్తిన వరద బెజవాడను అతలాకుతలం చేయడం చూస్తున్నదే. అటు మున్నేరు, ఇటు బుడమేరు తాకిడితో పోటెత్తిన కృష్ణమ్మ.. కాలనీలకు కాలనీలనే ముంచేసింది. ప్రమాదకర పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. సహాయక చర్యలపై ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాగానికి ఆదేశాలిస్తూనే..వరద బాధితులకు ధైర్యం చెప్పేందుకు తానే రంగంలోకి దిగారు ముఖ్యమంత్రి చంద్రబాబు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అపారమైన అనుభవమున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రమాదకర వరద పరిస్థితిని అనుక్షణం సమీక్షిస్తూనే -రెండురోజులుగా కంటిమీద కనుకన్నది లేకుండా వరద ప్రాంతాల్లోనే పర్యటిస్తున్నారు. అధికారులు సైతం సాహసం చేయని వరద ప్రాంతాలకు ఎదురెళ్తూ.. ప్రజలకు ధైర్యం చెబుతోన్న, సహాయక చర్యలు తీసుకుంటున్న పరిస్థితి.. మానవత్వంలేని వైసీపీ రాక్షస మూకలకు కనిపించక పోవడం దురదృష్టకరం. కొంపాగొడ్డు మునిగి ప్రజలు కొండంత కష్టంలో వుంటే.. అమరావతి మొత్తం మునిగిపోయిం దంటూ వికృత వార్తలకు తెగబడటం జగన్ విషపుత్రిక సాక్షికే చెల్లింది. నిజంగా ముంపునకు గురైన ప్రాంతాల ను, అక్కడి ప్రజలకు ధైర్యం చెప్పి.. చేతనైన సాయం చేయాల్సిన తరుణంలో వికృత రాజకీయాలకు అలవాటుపడిన రాక్షస మూకలు తప్పుడు రాతలకు తెగబడటం క్షమించరాని నేరం. 'జగన్.. రాజకీయాలకు అనర్హుడు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ఎందుకు వ్యాఖ్యానిస్తారో.. ఇలాంటి సందర్భాలను చూసి అర్థం చేసుకోవచ్చు. కష్టాల్లోవున్న ప్రజల ప్రాణాలపై కనీస మనవతా ధర్మాన్ని ప్రదర్శించకపోవడం ఒక ఎత్తయితే.. ప్రజలు మరింత బెదిరిపోయేలా పచ్చి అబద్ధాలను ప్రచారానికి పెట్టడం రాక్షసజాతి లక్షణమే.

ఏపీ భవిష్యత్‌కు కొత్త చరిత్రను లిఖించదగ్గ అమరావతిపై నీలిమీడియా రోతకథనాలు ప్రచురించడం ఉపేక్షించలేనిదే. నీలిమీడియాలో తప్పుడు కథనాలు చూస్తుంటే.. ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రులకు ఎలాంటి గుర్తింపు లేకుండా చేయడమే జగన్‌రెడ్డి లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రతిపక్ష హోదాలేకున్నా.. ప్రత్యర్థి పార్టీగా నిర్మాణాత్మక విమర్శతో సమాజానికి మేలు చేయాల్సిన వైసీపీ.. పనిగట్టుకుని రోత కథనాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి సాహసించడం తెంపరితనమే. బ్లూ మీడియాను, సాక్షి ఛానల్ అడ్డంపెట్టుకుని అమరావతి మునిగిపోయిందంటూ చేస్తోన్న తప్పుడు ప్రచారాలను ప్రజలు గమనించకపోరు. కళ్లముందు కనిపిస్తోన్న వాస్తవాలను వక్రీకరించి.. మార్ఫింగ్ చిత్రాలు, వీడియోలను ప్రసారం చేసినంత మాత్రాన.. వైసీపీ మాయలను ప్రజలు నమ్ముతారనుకోవడం జగన్ అవివేకానికి నిలువెత్తు నిదర్శనం. గతంలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు వరదలొస్తే అతలాకుతలమయ్యాయి. కానీ నేడు కృష్ణమ్మ కనీవినీ ఎరుగని ఉగ్ర రూపం దాల్చినా.. అమరావతి సురక్షితంగా ఉండటం కళ్లకు కనిపిస్తోన్న వాస్తవం.

## వైసీపీ పాలనలో ఎన్టీఆర్ ట్రస్టు నుంచి సాయం

రాష్ట్రభవిష్యత్‌పై దుష్ప్రచారం మానుకుని.. కష్టంలో వున్న ప్రజలను ఆదుకోవడానికి ముందుకు రావాల్సిన వైసీపీ.. విష ప్రచారానికి దిగడం సిగ్గుచేటు. జగన్‌రెడ్డి ధనదాహానికి అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి పదుల సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. అప్పుడు ప్రతిపక్షంలోవున్నా ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి నారా భువనేశ్వరి బాధితులను ఆదుకున్నారే తప్ప..వైసీపీ నేతల్లా ఎన్నడూ ఫేక్ ప్రచారం చేయలేదు. వైసీపీ హయాంలో గోదావరికి వరదలు సంభవించి ప్రజలు అల్లాడిపోతే.. సాయం పేరిట ఒక ఉల్లిగడ్డ.. ఒక ఉర్లగడ్డ.. ఎనిమిది పచ్చిమిరపకాయలు, ఒక కొవ్వొత్తిని వరద బాధితుల చేతిలో పెట్టిన జగన్ ఘనకార్యం జనం మర్చిపోయేది కాదు. అలాంటిది.. బాధితులకు ధైర్యం చెప్పేందుకు తెల్లవార్లూ తానూ వరద ప్రాంతంలోనే ఉండిపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలకు దిగడం సిగ్గుమాలిన రాజకీయమే.

## 5 కోట్ల ఆంధ్రులకు అమరావతితోనే భద్రత

అత్యంత భారీ వర్షపాతం నమోదైనా అమరావతి ప్రాంతం ముంపుకు గురికాలేదు. గత 120ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వరద ఉధృతి దాల్చినా.. అమరావతి ప్రాంతం మునిగిపోలేదు. దీనికి విరుద్ధంగా జగన్‌రెడ్డి ఫేక్ ప్రచారం చేయడం విడ్డూరం. వాస్తవానికి అమరావతి ముంపునకు గురవ్వాలన్నది జగన్ వికృత కోరిక. తన విశాఖ రాజధాని వాదనను బలపర్చుకుని.. దోపిడీ చేసిన భూముల ధరలు పెంచుకోవాలన్నది జగన్ కుట్రకు కారణం. అమరావతి ముంపును ప్రచారం చేసి.. ప్రభుత్వ వైఫల్యంపై విషం కక్కడానికి జగన్ చేస్తోన్న కుట్రలో ఇదొకటి. వాస్తవానికి.. గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం కూడా. రాష్ట్రాన్ని అన్ని విధాలా భ్రష్టు పట్టించి, వ్యవస్థలను నిర్వీర్యం చేసి అమరావతికి చీడ పట్టించిన చెదలపుట్ట జగన్‌రెడ్డి.

## ప్రజల్లో విషబీజం నాటేందుకే..

అధిక వర్షాలు, కృష్ణమ్మ వరద ఉధృతికి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోరాడుతుంటే, జగన్‌రెడ్డి మాత్రం ప్రజలుబాగోగులు పక్కనపెట్టి రాజధానినే నమ్ముకున్న ప్రజల మనోభావాల్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాడు. భారీ వర్షంతో అమరావతిలో నిలిచిన నీళ్లను ముంపుగా చూపించి రాజధానికి అనర్థమున్న విష ప్రచారంతో ప్రజానిర్ణయాన్నే అవహేళన చేస్తున్నాడు. గత ఐదేళ్లుగా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి.. కూటమి ప్రభుత్వం నిర్మించే రాజధానినీ అపహాస్యం చేసే ప్రయత్నమే సాక్షిలో వస్తోన్న రోత రాతలకు కారణం.

## అధికారంలో ఉన్నపుడూ అమరావతిపై విషమే..

రాష్ట్రాభివృద్ధి అమరావతితోనే సాధ్యమని రాష్ట్ర ప్రజలు భావిస్తున్న తరుణంలో.. ఏపీ ప్రగతిని కూలదోసేందుకు సాక్షిలో అసత్య కథనాలు ప్రచురించడం.. వైసీపీ నిజ స్వరూపాన్ని బయటపెడుతుంది. రాష్ట్రాభివృద్ధికి రాజధాని అమరావతిని తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు తపన పడుతుంటే.. జగన్‌రెడ్డి మాత్రం గత ఐదేళ్లుగా అమరావతిని ముళ్లపొదల్లో మగ్గబెట్టాడు. ఇన్నాళ్లు చీకటిలో ఉన్న అమరావతిలో వెలుగులు నింపడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు చూసి జగన్‌రెడ్డికి నిద్ర పట్టక నిందలు వేస్తున్నారు. అమరావతిని రాజధానిగా నిర్మించకుండా ఉండేందుకు ఐదేళ్లు ప్రయత్నించి విఫలమైన జగన్..భారీ ఓటమి తరువాతా కుట్రలు మానకోకుంటే వైసీపీ మనుగడకే ముప్పుతెచ్చిన వాడవుతాడు.

## నోరు తెరిస్తే అబద్ధాలే...

జగన్మోహన్‌రెడ్డికి లేనిది ఉన్నట్లు.. ఉన్నది లేనట్లు చెప్పడం సహజ లక్షణం. అచువుగా అబద్ధాలు చెప్పడం.. తాను చెప్పే అబద్ధమే నిజమని నమ్మించేందుకు ఎంతకైనా దిగజారతాడు అనడానికి.. అమరావతిపై విషపత్రిక సాక్షిలో వస్తోన్న కథనాలే సాక్షి. ఆనాడు అమరావతిలో ఉన్న పేదవాళ్లకు అన్యాయం జరిగింది.. టీడీపీ నేతలు బలవంతంగా రైతుల భూములు లాక్కున్నారని జగన్‌రెడ్డి చేసిన విష ప్రచారమే అతని కొంపముంచింది. ఇవి చాలవన్నట్లు ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఔటర్ రింగ్‌రోడ్డు అంటూ కొంతకాలం రోత రాతలతో కాలయాపన చేశాడు. జగన్ ప్రయత్నాలన్నీ గత ఎన్నికలలో బెడిసి కొట్టడంతో.. నేడు అమరావతిపై తప్పుడు కథనాలకు దిగాడు. ప్రజల కష్టాలపై కనీస మానవత్వం చూపని జగన్.. రాజకీయ లబ్ధికోసం దేనికైనా దిగజారతాడనడానికి ఇదొక ఉదాహరణ. అందుకు జగన్ మూల్యం చెల్లించక తప్పదు.

**- కె. శిరీష**

---

## ముంపు బాధితులను ఆదుకునేందుకు..
# నిరంతరం శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు: మంత్రి పార్థసారథి



అమరావతి(చైతన్యరథం): వరద బాధితులను ప్రమాద పరిస్థితులు నుంచి బయటపడేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో శ్రమిస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన మంత్రి పార్థసారథి సహాయక చర్యలను, బాధితులకు సాయం అందిస్తున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఎగువున క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షం భారీగా పడి దిగువనున్న విజయవాడకు రావటంతో సింగ్‌నగర్ ప్రాంతం బుడమేరు వరద ముంపునకు గురైందన్నారు. ప్రభుత్వం ఎక్కడికక్కడ బాధితులను ఆదుకునేందుకు కృషిచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాలువల మరమ్మత్తుల పనులను సకాలంలో చేయకపోవడం వల్ల నేడు ఈ ముంపు పరిస్థితులు ఏర్పడాయన్నారు. బుడమేరు, డ్రైన్లను నిర్లక్ష్యం చేయటం వల్ల కాలువలో గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయన్నారు. గత ఐదు సంవత్సరాల్లో బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిన దానికి ఫలితమే నేటి ఈ వరద ముప్పు అన్నారు. ఎక్కడికక్కడ వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారి వివరాలు డ్రోన్ల సహాయంతో టెక్నాలజీని ఉపయోగించి గుర్తించి సహాయం అందిస్తూ వారికి అండగా ప్రభుత్వం ఉంటోందన్నారు. హెలికాప్టర్ల సాయంతో బాధితులకు ఆహార పదార్థాలు తదితరాలు అందిస్తున్నామన్నారు. ఆహార పొట్లాలు, పాలు, మంచినీరు, బిస్కెట్లు వంటివి అందిస్తున్నామని మంత్రి పార్థసారథి చెప్పారు.



# 'దివీస్' ఔదార్యం

- రూ.2.5 కోట్లతో ముంపు బాధితులకు ఆహారం
- 1.7 లక్షల మందికి ఐదు రోజులపాటు అందిస్తామని వెల్లడి




అమరావతి(చైతన్యరథం): వరద బాధితులకు ఆకలి తీర్చేందుకు దివీస్ సంస్థ ముందుకొచ్చింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో విజయవాడలో అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలు వరద ముంపునకు గురయ్యాయి. ఈ పరిస్థితులలో అనేక కాలనీలలో ప్రజలు, పిల్లలు, వృద్ధులు భోజన సౌకర్యం లేక అల్లాడిపోతున్నారనే వార్తలు వెలువడుతున్న తరుణంలో దివీస్ యాజమాన్యం వెంటనే స్పందించి ప్రతి రోజూ 1,70,000 మందికి పైగా ప్రజలకు ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలను అందిస్తామని ప్రకటించింది. ఏ.పీ. అక్షయ పాత్ర అనుబంధ సంస్థ హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ముంపు బాధితులకు ఆహారం అందజేసేందుకు దివీస్ సంస్థ ఏర్పాట్లు చేసింది. సోమవారం నుండి ప్రభుత్వం సూచించిన ప్రాంతాల్లో అవసరమైన ప్రజలకు స్వయంగా అందజేస్తున్నామని దివీస్ సంస్థ ఎం.డి. డా.మురళీకృష్ణ దివి తెలియజేసారు. ఇటువంటి విపత్కర సమయంలో ముందుగా ఆపన్న హస్తాన్ని అందిస్తున్న దివీస్ సంస్థకు హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు, మంగళగిరి క్లస్టర్ సంస్థ ప్రతినిధి వంశధార దాస కృతజ్ఞతలు తెలిపారు. వార్తల ద్వారా ముంపు బాధితుల వెతలు తెలుసుకుని వెంటనే స్పందించి బాధితులకు అక్షయ పాత్ర అనుబంధ సంస్థ ద్వారా ఆహారాన్ని అందించేందుకు సహకరిస్తున్న దివీస్ యాజమాన్యాన్ని ప్రభుత్వ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆహారాన్ని 3 పూటలా రానున్న 5 రోజులపాటు, అవసరమైతే మరిన్ని రోజులు అందజేస్తామని, సుమారు 2 కోట్ల 50 లక్షల రూపాయలు అంచనా విలువైన ఆహారాన్ని తయారు చేయించి విజయవాడ పరిసర ముంపు ప్రాంత వాసులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని మురళీ కృష్ణ దివి తెలియజేసారు.



# ముంపు బాధితులకు అక్కాచెల్లెళ్ల విరాళం

## - ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున సీఎంకు అందజేత

అమరావతి(చైతన్యరథం): భారీ వర్షాలతో వచ్చిన వరదతో బాధితులుగా మారిన వారికి బాసటగా నిలిచేందుకు విజయవాడకు చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ముందుకు వచ్చారు. తమ వంతు సాయంగా బాధితుల కోసం ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న సీఎంను కలిసి విజయలక్ష్మి, నిర్మాలాదేవి, రాణి అనే ముగ్గురు అక్కా చెల్లెళ్లు సోమవారం విరాళం అందించారు. ఈ సందర్భంగా వారిని సీఎం అభినందించారు.



# సహాయక చర్యల్లో పాల్గొనండి

**పార్టీ నేతలు, శ్రేణులకు మంత్రి లోకేష్ పిలుపు**



అమరావతి(చైతన్యరథం): వరద సహాయ చర్యల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పార్టీ శ్రేణులకు మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు. ప్రకాశం బ్యారేజి భద్రతపై ఎటువంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు లోకేష్ విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు విజయవాడ వచ్చి ప్రకాశం బ్యారేజీని పరిశీలిస్తారన్నారు. మంత్రి లోకేష్ పర్యవేక్షణలో వరద సహాయ చర్యలు వేగంగా జరుగుతున్నాయి. గంటగంటకు పరిస్థితిని సమీక్షిస్తూ అధికార యంత్రాంగానికి మంత్రి లోకేష్ సూచనలు ఇస్తున్నారు. కాగా మంత్రి లోకేష్ పిలుపు మేరకు మంగళవారం నాడు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతోపాటు సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సహాయ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇలాఉంటే కొటికలపూడిలో కృష్ణానది వరదలో చిక్కుకున్న 21మందిని ఎఎల్ హెచ్ 717 హెలీకాప్టర్ ద్వారా కాపాడిన ఎన్ డిఆర్ఎఫ్ బృందాలు, సురక్షిత ప్రాంతానికి తరలించాయి.

# వరదల్లో హోంమంత్రి అనిత నివాసం



- తరలించేందుకు వచ్చిన విపత్తు నిర్వహణ బృందం
- తనకంటే ముందు ముంపు ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశం
- ఆపై స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొని పర్యవేక్షణ
- బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు
- జనజీవనం సాధారణ స్థితికి వచ్చేదాకా కదిలేది లేదని వెల్లడి
- గత ఐదేళ్లు జలవనరుల శాఖ నిద్రపోయిందని వ్యాఖ్య

విజయవాడ(చైతన్యరథం): నగరంలోని రామవరప్పాడు వంతెన కింద ఉన్న హోం మంత్రి అనిత నివాసం వరద నీటితో జలమయమైంది. ఈ క్రమంలోనే విపత్తు బృందం అక్కడికి చేరుకుంది. కానీ, తన ఇంటి వద్ద కంటే ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. సహాయక బృందాన్ని సింగ్‌నగర్ వైపు పంపించారు. అనంతరం తన పిల్లలను ఓ ట్రాక్టర్ ఎక్కించి సురక్షిత ప్రాంతానికి పంపించి తర్వాత స్వయంగా వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఆదివారం నుంచి హోం మంత్రి నివాసం వరద ముంపులోనే ఉన్నా అనిత సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. కాలనీలో ఇతర కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

### బుడమేరు కట్ట తెగిపోవడంతోనే వరద

ఆదివారం ఉదయం బుడమేరు కట్ట తెగిపోవటంతో ఒక్కసారిగా వరద నీరు విజయవాడ నగరాన్ని ముంచెత్తిందని హోం మంత్రి అనిత తెలిపారు. నగరంలోని 8 డివిజన్లతో పాటు గన్నవరం, మైలవరం,విజయవాడ తూర్పు పరిధిలోని కొన్ని ప్రాంతాలు కూడా వరద తాకిడికి గురయ్యాయని తెలిపారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల పరిధిలో 24 కాలనీలు 70 సచివాలయాలు ఉన్నాయని చెప్పారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఒక ఐఏఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించామని వెల్లడించారు. యుద్ధప్రాతిపదికన 5,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు వివరించారు. మిగిలిన వారిని తరలించేందుకు పడవల సమస్య ఉండటంతో కేంద్ర సాయం కోరామని పేర్కొన్నారు. విజయవాడ నగరం సాధారణ స్థితికి వచ్చి జనజీవనం మామూలుగా సాగేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అంతవరకూ ముఖ్యమంత్రి సహా ఏఒక్కరూ కదలకూడదని నిర్ణయించామని చెప్పారు. దాదాపు 2 లక్షల మందికి యుద్ధప్రాతిపదికన ఆహారం పంపిణీ చేపట్టామని వెల్లడించారు.

### గత ఐదేళ్లు జలవనరుల శాఖ నిద్రపోవడంతోనే ఈ దుస్థితి

విజయవాడ నగరాన్ని ముంచెత్తిన వరద నీటిని ఎక్కడికి ఎత్తి పోయాలన్నది ఇప్పుడు ప్రధాన సవాల్‌గా మారిందని చెప్పారు. మంత్రి రామానాయుడు నేతృత్వంలో జలవనరుల శాఖ దీనిపై క్షేత్ర స్థాయిలో నిర్విరామంగా పనిచేస్తోందని వెల్లడించారు. గత ఐదేళ్లు జలవనరుల శాఖ నిద్రపోవడం వల్లే ఇప్పుడు వరద నీరు ఎటు పంపాలో అర్థం కాని పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు.



# ప్రభుత్వం ఏం చేయాలో అదే చేస్తోంది

## - నారా భువనేశ్వరి

అమరావతి(చైతన్యరథం): విపత్తు సమయాల్లో ఏం చేయాలో రాష్ట్ర ప్రభుత్వం అదే చేస్తోందని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. రాష్ట్రంలో వరద పరిస్థితులు, సీఎం చంద్రబాబు అహోరాత్రాలు సమీక్షలు చేపడుతూ, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న తీరు పట్ల భువనేశ్వరి స్పందించారు. ప్రకృతి విపత్తులను ఆపడం మన చేతుల్లో ఉండదని... కాకపోతే అలాంటి సమయాల్లో వేగంగా స్పందించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు సహాయక చర్యలు అందిస్తే... ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించుకోవచ్చని, బాధితులకు భరోసా కల్పించవచ్చని సూచించారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం అదే చేస్తోందని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అయ్యుండి చంద్రబాబు స్వయంగా బాధితుల వద్దకు వెళ్లారు. బాధితులకు ఆహారం, నీరు అందించి



ధైర్యం చెప్పారు. సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయి. అన్ని కార్యక్రమాల్లోనూ ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కూడా తన వంతు సాయంగా రంగంలోకి దిగుతోంది. ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాను. దాంతోపాటే వాలంటీర్స్ తమ వంతు సహాయం చేయాలని అని కోరుతున్నానని నారా భువనేశ్వరి పేర్కొన్నారు.

చైతన్యరథం

## వరదకు ఎదురీది...

# ముంపు ప్రాంతాల్లో మంత్రి సవితమ్మ పర్యటన

- బోటులో వెళ్లి బాధితులను ఒడ్డుకు చేర్చేలా చర్యలు
- నడుం లోతు నీటిలో బాధితులకు పరామర్శ
- అన్ని విధాలా ఆదుకుంటామంటూ భరోసా
- చంద్రబాబు స్ఫూర్తితో ముందుడి సహాయక చర్యలు



అమరావతి(చైతన్యరథం): ఊళ్లకు ఊళ్లు మింగేసిన కృష్ణమ్మ ఉగ్రరూపంతో ఉప్పొంగుతోంది. గజ ఈతగాళ్లు సైతం కదలిలా ఎగిసిపడుతున్న కృష్ణమ్మను చూసి వణికిపోయారు. ఇవేవీ ఆమెను భయపట్టలేక పోయాయి. సీఎం చంద్రబాబు అప్పగించిన బాధ్యత, వరద ఉధృతిలో చిక్కుకున్న బాధితులను రక్షించాలనే ఆమె కర్తవ్యం ముందు ఉగ్ర కృష్ణమ్మ చిన్న బోయింది. భవిష్యత్తు కొట్టుకుపోయిందని కన్నీటి సంద్రంలో కన్నీరుమున్నీరవుతున్న ముంపు బాధితుల్లో ఆమె మాటలు భరోసా నింపాయి. భయం లేదు... మేమున్నామన్నంటూ ఇచ్చిన ఓదార్పు కృష్ణమ్మ కదలిలో చిక్కుకున్న వారికి ఆపన్నహస్తమైంది. మహా మహులు సైతం వరద ఉధృతిని చూసి బెంబేలెత్తినా ఆమె వెరవలేదు. మొక్కవోని ధైర్యంతో బోటు మీద వెళ్లి వరదలో చిక్కుకున్న వారిని కృష్ణమ్మ ఒడ్డుకు చేర్చారు. ఇవీ పామర్రు, పెనమలూరులో కనిపించిన దృశ్యాలు. మంత్రి ఎస్. సవితమ్మ వరదలను లెక్కచేయకుండా సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొనడం అక్కడి అధికారుల్లో స్ఫూర్తి నింపాయి. వరద బాధితుల్లో భరోసా కల్పించాయి.

### సీఎం చంద్రబాబు ఆదేశాలతో..

గతంలో ఎన్నడూ లేనంతగా కురిసిన భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతితో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కొన్ని ప్రాంతాలను కృష్ణమ్మ ముంచేసింది. గంటల వ్యవధిలో విజయవాడ, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో ఇళ్లు వర ద నీటిలో చిక్కుకున్నాయి. వేలాది మంది కృష్ణమ్మ వరద ఉధృతిలో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు రేయింబవళ్లు రెండ్రోజులుగా విజయవాడ కలెక్టరేట్ నుంచి సమీక్షలు నిర్వహిస్తూ వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా దిశా నిర్దేశం చేస్తున్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బాధితులకు భోజనం, వసతి సౌకర్యం కల్పించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి సూచనల మేరకు రాష్ట్ర చేనేత జౌళి, బీసీ, ఈడ బ్ల్యూఎస్ సంక్షేమ మంత్రి ఎస్.సవిత పెనమలూరు, పామర్రు వరద ప్రాంతాల్లో పర్యటించారు. రామలింగేశ్వ ర్‌నగర్, తాడిగడపలో మున్సిపాలిటీలో వడ్డేరు కాలనీ, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ కాలనీ, మాదు తిరుపతిరావునగర్ తదితర ప్రాంతాల్లో నడుం లోతుల్లో నీటిలో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వరద బాధితులకు బిస్కట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వరద ఉధృతి పెరిగే ప్రమాద ముందని తక్షణమే ఇళ్లు ఖాళీ చేయాలని కోరారు. ప్రభుత్వం పునరావాస కేంద్రాల్లో భోజనం, వసతి సౌకర్యాలు కల్పించిందని, వరదలు తగ్గే వరకు అక్కడ ఉండాలని ధైర్యం చెప్పారు.

### బోటులో వరద బాధితులకు ఒడ్డుకు చేర్చి...

కేవలం పర్యటనలు, ఓదార్పు మాటలతో సరిపెట్టకుండా మంత్రి సవిత రంగంలోకి దిగారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వరదలో చిక్కుకున్న బాధితులను రక్షించడానికి స్వయంగా బోటులో వెళ్లి ఒడ్డుకు చేర్చారు. తాడిగడపలో పర్యటన అనంతరం అక్కడి నుంచి పెన మలూరులోని వరద ప్రాంతాల్లో పర్యటించారు. మంత్రిని చూసిన గణపతినగర్, శ్రీనగర్ కాలనీలోని ప్రజలు రక్షించాలంటూ కేకలు వేశారు. తొలుత శ్రీనగర్ కాలనీలో కాలనీ వాసు లతో పాటు బాలింత, రెండు నెలల పసికందు కూడా వరద నీటిలో చిక్కుకున్నట్లు తెలిసిన మంత్రి సవిత ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో మాట్లాడారు. వారు ఏర్పాటు చేసిన బోటులో స్వయంగా శ్రీనగర్ కాలనీలో పర్యటించారు. బోటులోనే ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లు అంద జేశారు. చిన్నారులను, మహిళలను తాను ఎక్కిన బోటులోనే ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి గణపతినగర్ చేరుకుని బోటులో వరద బాధితులకు ఒడ్డుకు చేర్చారు. తిరుగు పయనంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కలిసి పెనమలూరులోని వరద ప్రాంతాల్లో భారీ పడవలో పర్యటించి వరద బాధితులను పెద్ద సంఖ్యలో ఒడ్డుకు చేర్చారు.

### చంద్రబాబు ఉన్నారు భయమొద్దు...

వరద బాధితులను ఆదుకోడానికి సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి ధైర్యం చెప్పారు. పామర్రులోని వల్లూరుపాలెం, తొట్లవల్లూరు జెడ్పీ హైస్కూళ్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే వర్ల కుమారరాజాతో కలిసి మంత్రి సందర్శించారు. కన్నీటి పర్యంతమైన బాధితులను మంత్రి ఓదార్చారు. 'భయపడాల్సిన అవసరం లేదు. సీఎం చంద్రబాబు అందరినీ ఆదుకోవడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ప్రాణనష్టం కలగకుండా చర్యలు తీసుకున్నాం. రాబోయే రోజుల్లో ఆస్తి నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం కూడా చెల్లిస్తాం' అని తెలిపారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పున రావాస కేంద్రాల్లో రెండ్రోజులు సేద తీరాలని, సొంత గ్రామాలకు తప్పనిసరిగా తరలిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కుమార రాజా మాట్లాడుతూ మంత్ర సవితను చంద్రబాబు పంపారని, భయపడాల్సిన పని లేదని అన్నారు. తాను కూడా 24గంటలూ మీతోనే ఉంటానని, ఏ కష్టమొచ్చినా ఆదుకోడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ధైర్యం చెప్పారు.

### బాధితుల కోసం 24 గంటలూ పనిచేద్దాం...

పామర్రులోని వల్లూరుపాలెం, తొట్లవల్లూరు జెడ్పీ హైస్కూళ్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించిన మంత్రి సవిత...అక్కడున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్య కర్తలతో మాట్లాడారు. బాధితులకు అండగా ఉండాల్సిన సమయం వచ్చింది. సీఎం చంద్రబాబు రెండురోజుల నుంచి నిద్రాహారాలు మాని పని చేస్తున్నారు. మనం కూడా చంద్రబాబుబాటలో నడుస్తూ వరద బాధితులకు మెరుగైన సేవలు అందిద్దామని పిలుపునిచ్చారు.మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ... బాధితుల్లో మనో ధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. వైద్యశిబిరాల్లో అందుబాటులో ఉంచిన మందులను పరిశీలించారు.

### వరదలు తగ్గిన వెంటనే పంట, ఆస్తి నష్టం లెక్కింపు

తొట్లవల్లూరులో తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. వరద బాధితుల కోసం రేయింబవళ్లు కృషి చేస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో భోజనంతో పాటు వసతి సౌకర్యాలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరదలు తగ్గగానే పంట నష్టాలతో పాటు ఆస్తి నష్టం లెక్కిస్తామని తెలిపారు. బాధితులందరికీ న్యాయం చేయాలనే దృక్పథంతో సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని వివరించారు. రైతులకు న్యాయం జరిగేలా పంట నష్టం వివరాలు అంచనా వేస్తామని చెప్పారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.









# కొట్టుకొచ్చిన ఆ 4 బోట్ల వెనుక వైసీపీ కుట్ర

- ఆ పార్టీ నేతలు అంతటి దుర్మార్గాలు చేయగలిగిన ఘనులే
- 11 లక్షల క్యూసెక్కులు పోటెత్తినా అమరావతి చెక్కు చెదరలేదు
- కొన్ని పేటీఎం బృందాలు, పెయిడ్ చానళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు
- ప్రకాశం బ్యారేజ్ గేట్ల దగ్గర నిపుణుడితో మరమ్మతులు చేయిస్తాం
- బుడమేరుకు పడిన మూడు గండ్లను పూడ్చి వేయించేందుకు చర్యలు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



విజయవాడ(చైతన్యరథం): ప్రకాశం బ్యారేజ్‌కు 4 బోట్లు కొట్టుకురావటం వెనుక వైసీపీ కుట్ర ఉండి ఉండవచ్చని మంత్రి నిమ్మల రామానాయుడు అనుమానం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నేతలు అంతటి దుర్మార్గాలు చేయగలిగిన ఘనులేనని వ్యాఖ్యానించారు.

అమరావతి ముంపు ప్రాంతమనే జగన్ కల సాకారా నికి కొన్ని పేటీఎం బృందాలు, పెయిడ్ చానళ్లు తీవ్ర దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 11.5లక్షల క్యూసెక్కులు పోటెత్తినా అమరావతి చెక్కుచెదరలేదని స్పష్టం చేశారు. అమరావతిపై ఫేక్ న్యూస్ ఎవరూ నమ్మవద్దని కోరారు. అమరావతిపై విషం చిమ్మడం వైసీపీకి మొదటి నుంచి అలవాటేనని తెలిపారు. రాజధాని అమరావతికి ఎలాంటి ప్రమాదం లేదన్నారు. కృష్ణా కరకట్టపై మంతెన ఆశ్రమం వద్ద షట్టర్‌కు ఐదేళ్లుగా గ్రీజ్ పెట్టలేదని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అక్కడ వరద నీరు వచ్చాయని చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ దగ్గరకు గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు వస్తున్నారని చెప్పిన మంత్రి రాత్రికి మరమ్మతులు చేస్తారని వెల్లడించారు. బుడమేరుకు పడిన 3 గండ్లను ఈ రాత్రికి పూడ్చే ప్రయత్నం చేయిస్తామని తెలిపారు.

### నేడు, రేపు ఎన్టీఆర్ భవన్‌లో 'ప్రజా వేదిక' రద్దు

అమరావతి(చైతన్యరథం): అకాల వర్షాలు, వరదలు కారణంగా మంగళ, బుధవారాల్లో మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కర్యాలయంలో జరగాల్సిన "ప్రజా వేదిక" కార్యక్రమాన్ని రద్దు చేశారు.

అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు వరద సహాయక చర్యల్లో నిమగ్నమైనందున ఈ రెండు రోజుల్లో ప్రజల నుండి వినతులు స్వీకరించే ప్రజావేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు శాసనమండలి సభ్యులు, కేంద్ర కార్యాలయం కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ విషయం గమనించాలని ఆయన కోరారు.

# ముందుండి నడిపించిన సీఎం చంద్రబాబు

## ముమ్మరంగా సహాయ చర్యలు

- మంత్రి పయ్యావుల వెల్లడి
- నిబంధనలు, పరిమితులు చూడొద్దని సీఎం ఆదేశించారు
- ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న మంత్రి లోకేష్
- గత ప్రభుత్వం కాలువలు, డ్రైన్లను గాలికి వదిలేసినందునే వరద ముంపు



అమరావతి(చైతన్యరథం): వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు తక్షణ సాయం అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. ముంపు బాధితులకు సహాయక చర్యలు పూర్తిస్థాయిలో సజావుగా సాగేందుకు వీలుగా నిధుల కొరత అనే మాట లేకుండా ఏర్పాట్లు చేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. ఇందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు నిబంధనలు, పరిమితులు చూడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో మొత్తం ప్రభుత్వ యంత్రాగం మొత్తం సహాయక చర్యల్లో నిమగ్నమయిందన్నారు. విజయవాడలో సహాయక చర్యల్లో పాల్గొంటున్న పయ్యావుల సోమవారం మీడియాతో మాట్లాడుతూ విజయవాడ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో వర్షాలు కురియడంతో సింగ్ నగర్ ప్రాంతంలో బుడమేరు వరద ఉధృతి పెరిగిందన్నారు. 100, 200 ఏళ్ళ చరిత్ర చూసినా ఇంత భారీగా వర్షం కురిసిన దాఖలాలు లేవన్నారు. 2009 కంటే ఇప్పుడు కృష్ణాకు భారీగా వరద వచ్చింది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఇంత పెద్ద స్థాయిలో వరద వస్తుందని ఊహించలేదు. తెలంగాణ ప్రాంతంలో ఎగువన కురిసిన వర్షాలకు స్థానికంగా వర్షాలు తోడవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, ముందుచూపు వల్ల ఆపదలో ఉన్న ప్రజలకు యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టేందుకు వీలయింది. అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా కష్టాల్లో ఉన్న ప్రజలకు సాయం అందించడంలో మొత్తం అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి సర్వసన్నద్ధం చేశారు. రెవెన్యూ, పోలీస్, పురపాలక.. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముంపు ప్రభావిత బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. విద్య, ఐటీశాఖల మంత్రి లోకేష్.. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ బాధితులకు సహాయం అందించే చర్యలు సరైన విధంగా జరిగేలా చూస్తున్నారని మంత్రి పయ్యావుల చెప్పారు.

### మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు

డివిజన్ల స్థాయిలో, వార్డు సచివాలయ స్థాయిలో మంత్రులకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించి వివిధ అధికారులను, క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బాధితులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నాం. గత ప్రభుత్వం కాలువలు, డ్రైన్లకు సరైన మరమ్మతులు చేయకుండా గాలికి వదిలేయడంతో వరద ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఈ దుస్థితి ఎదురయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, బోట్లను రంగంలోకి దిగేలా చేశారు. ముందుగా ప్రజలకు అత్యవసరమైన ఆహార పదార్థాలను అందించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి అహర్నిశలు కృషి చేస్తున్నాయి. స్థానికంగా ఆహార ప్యాకెట్లను సిద్ధం చేయడంతో పాటు పక్క జిల్లాలనుంచి కూడా ఆహారం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నాం. సిద్ధం చేసిన ఆహార ప్యాకెట్లు, మంచినీరు, బిస్కెట్లు, తదితరాలను బాధితులకు చేరవేసేందుకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేశాము. బాధితులకు సహాయం అందించడంలో మీడియా కూడా భాగస్వామ్యం కావాలి. ప్రభుత్వం దృష్టికి మీడియా తీసుకువచ్చే అంశాలను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. బాధితులకు సహాయ, సహకారాలు అందించడం, మనోధైర్యం కల్పించడం అనేది అందరి సమష్టి బాధ్యత. ముఖ్యమంత్రి చొరవతో ఆయనతోపాటు మొత్తం అధికార యంత్రాంగం కలెక్టర్ కార్యాలయంలో ఉండి పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక చర్యలు చేపడుతోంది. క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తూ సహాయక చర్యలు సాఫీగా సాగేలా చూస్తున్నామని మంత్రి పయ్యావుల తెలిపారు.

---

#### సహాయ చర్యల పర్యవేక్షణకు ప్రాంతాల వారీగా

## అధికారుల నియామకం



అమరావతి(చైతన్యరథం): భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో విజయవాడలో సహాయ చర్యల కోసం ప్రాంతాల వారీగా ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. వారు క్షేత్రస్థాయిలో బాధితులకు అందుబాటులో ఉన్నారు. బాధితులకు అందించే పునరావాస కార్యక్రమాలను వీరు పర్యవేక్షించనున్నారు. అధికారుల వివరాలు, ఫోన్ నంబర్లు...

**విజయవాడ సెంట్రల్**

| | | | |
|---|---|---|---|
| 1. ఇందిరానగర్ కాలనీ | - | సుధాకర్ | 9640909822 |
| 2. రామకృష్ణాపురం | - | వెంకటేశ్వర్లు | 9866514153 |
| 3. ఉడా కాలనీ | - | శ్రీనివాస్ రెడ్డి | 9100109124 |
| 4. ఆర్ఆర్ పేట | - | వి. పెద్దిబాబు | 9848350481 |
| 5. ఆంధ్రప్రభ కాలనీ | - | అబ్దుల్ రబ్బానీ | 9849588941 |
| 6. మధ్యకట్ట | - | టి. కోటేశ్వరరావు | 9492274078 |
| 7. ఎల్బీఎస్ నగర్ | - | సీహెచ్ శైలజ | 9100109180 |
| 8. లూనా సెంటర్ | - | పి. శ్రీనివాసరావు | 9866776739 |
| 9. నందమూరి నగర్ | - | యు. శ్రీనివాసరావు | 9849909069 |
| 10. అజిత్‌సింగ్ నగర్ | - | కె.అనురాధ | 9154409539 |
| 11. సుబ్బరాజునగర్ | - | సీహెచ్ ఆశారాణి | 9492555088 |
| 12. దేవినగర్ | - | కే.ప్రియాంక | 8500500270 |
| 13. పటేల్ నగర్ | - | కె. శ్రీనివాసరావు | 7981344125 |

**విజయవాడ పశ్చిమ**

| | | | |
|---|---|---|---|
| 14. జోజినగర్ | - | వీకే విజయశ్రీ | 9440818026 |
| 15. ఊర్మిళా నగర్ | - | శ్రీనివాస్ | 8328317067 |
| 16. ఓల్డ్ ఆర్ఆర్ పేట | - | ఎస్ఏ అజీజ్ | 9394494645 |
| 17. పాల ఫ్యాక్టరీ ఏరియా | - | జె. సునీత | 9441871260 |

**విజయవాడ తూర్పు**

| | | | |
|---|---|---|---|
| 18. రాజరాజేశ్వరీ నగర్ | - | పి. వెంకటనారాయణ | 7901610163 |
| 19. మహానాడు రోడ్డు | - | పి.బాలాజీ కుమార్ | 7995086772 |
| 20. బ్యాంకు కాలనీ | - | హేమచంద్ర | 9849901148 |
| 21. ఏపీఐఐసీ కాలనీ | - | ఎ. కృష్ణచైతన్య | 9398143677 |
| 22. కృష్ణలంక | - | పీఎం సుభాని | 7995087045 |
| 23. రామలింగేశ్వరనగర్ | - | జి. ఉమాదేవి | 8074783959 |

**విజయవాడ రూరల్**

| | | | |
|---|---|---|---|
| 24. గొల్లపూడి | - | ఈ. గోపీచంద్ | 9989932852 |
| 25. రాయనపాడు | - | సాకా నాగమణెమ్మ | 8331056859 |
| 26. జక్కంపూడి | - | నాగమల్లిక | 9966661246 |
| 27. పైదూరుపాడు | - | శ్రీనివాస్ యాదవ్ | 7416499399 |
| 28. కేవీ కండ్రిక | - | మహేశ్వరరావు | 9849902595 |
| 29. అంబాపురం | - | బి. నాగరాజు | 8333991210 |

---

## వరద ప్రాంతాల్లో 75 వేల అత్యవసర మందుల కిట్లు

- విజయవాడ నగరంలో పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- వైద్యశిబిరాల్లో 24 గంటలు అందుబాటులో డాక్టర్లు
- వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు



అమరావతి(చైతన్యరథం): తుఫాన్, భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో సుమారు 75 వేల అత్యవసర మందుల కిట్ల పంపిణీకి వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసిందని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి ఫుడ్ ప్యాకెట్లతో పాటు 10వేల అత్యవసర మెడికల్ కిట్లను హెలి కాప్టర్ ద్వారా అధికారులు పంపించినట్టు చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన 14 మెడికల్ రిలీఫ్ క్యాంపులకు అత్యవసర మందుల కిట్లను అధికారులు చేరవేసినట్టు వివరించారు. అలాగే మరికొన్ని కిట్లను 10మొబైల్ మెడికల్ వాహనాల (ఎంఎంయూలు) ద్వారా పంపించినట్టు తెలిపారు. ఏపీఎంఎస్ ఐడీసీ నుంచి 50 వేల కిట్లు, డ్రగ్ కంట్రోల్ విభాగం నుంచి 25 వేల కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. మెడికల్ రిలీఫ్ క్యాంపుల్లో 24 గంటలు వైద్య సేవలందించేందుకు డాక్టర్లు, సిబ్బందితో పాటు సరిపడా మందులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. అత్యవసర మందుల కిట్‌లో ఆరు రకాల మందులతో పాటు ఎలా వాడాలన్న వివరాలతో కరపత్రాలు కూడా ఉంచామన్నారు. పారిశుధ్యం, నీటి కాలుష్యం వల్ల సంభవించే జ్వరం, జలుబు, వాంతులు, విరేచనాలు వంటి అనారోగ్య సమస్యలకు ఏయే మందులు ఎలా వేసుకోవాలో వాటిల్లో వివరించామని చెప్పారు.

ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామని తెలిపారు. బోట్ల ద్వారా ఫుడ్ ప్యాకెట్లతో పాటు బాధితులకు అత్యవసర మందుల కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సి.హరికిరణ్, ఏపీఎంఎస్ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్/డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ జి.లక్ష్మీషా, సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ.సిరి అత్యవసర మందుల పంపిణీని పర్యవేక్షించారు.

---

## యుద్ధప్రాతిపదికన దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం

- ఆర్‌అండ్‌బీ అధికారులకు మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి
- వరదలు తగ్గే వరకు సెలవులు రద్దు చేస్తున్నట్టు వెల్లడి
- రోడ్లు, భవనాలకు నష్టం వాటిల్లితే సమాచారం ఇవ్వాలి
- ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని ఆదేశం

అమరావతి(చైతన్యరథం): వరద ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు, భవనాల సంరక్షణ విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బి.సి. జనార్ధన్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో వరద ప్రభావిత కృష్ణా, గుంటూరు, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన ఆర్‌అండ్‌బీ ఎస్ఈలు, ఈఈలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ఈఎన్‌సీ, సీఈలు పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లో వరదలు, రోడ్లు, భవనాల పరిస్థితులపై అధికారులను ఆరా తీశారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం సుమారు 2,000కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, వాటిని యుద్ధప్రాతిపదికన నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

వరద ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. రహదారులు, భవనాలకు ఎటువంటి నష్టం వాటిల్లినా వాటిని వెంటనే ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయం, కంట్రోల్ రూమ్‌కు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా బ్రిడ్జిలు దెబ్బతిన్న ప్రదేశాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలని, ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరదలు తగ్గుముఖం పట్టే వరకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు సెలవులు రద్దు చేశామని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండా లని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని ఆదేశించారు.

# కృష్ణాకు పెరుగుతున్న వరద..

# తీరంలో రైతుల్ని అప్రమత్తం చేయండి

- పొలాలకు వెళ్లకుండా చూడాలి
- తీర, లంక గ్రామాల ప్రజలను తరలించాలి
- కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పంటలకు అధికనష్టం
- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ముంపు ప్రాంతాల్లో 175 వెటర్నరీ అంబులెన్స్‌లతో వైద్యశిబిరాలు
- 163 బోట్లతో 187 మంది మత్స్యకారులతో సహాయక చర్యలు
- వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖల అధికారులతో సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు
- విజయవాడ ముంపు ప్రాంతాల్లో మంత్రి పర్యటన
- వరదనీటిలో తిరుగుతూ బాధితులకు భరోసా



అమరావతి(చైతన్యరథం): భారీ వర్షాలు, పొంగుతున్న వాగులు, కాలువల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పడిన పరిస్థితిపై రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం అత్యవసర సమీక్షలు నిర్వహించారు. వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. కృష్ణా నదిలోకి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలకు రైతులెవరూ వెళ్లవద్దని,ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కృష్ణా, గుంటూరు, బాపట్ల,ఎన్టీఆర్ జిల్లాల్లో పంటనష్టం అధికంగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకొచ్చారు. ప్రాణహాని లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, నదీ పరివాహక ప్రాంతాల్లో, లంక గ్రామాల్లో ఉన్న వారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉండి రైతులకు సూచనలు ఇస్తూ పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనా వేయాలని మంత్రి ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

### ముంపు ప్రాంతాల్లో పర్యటన

విజయవాడ అజిత్‌సింగ్ నగర్ వరద ముంపు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు వాస్తవ పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వరద నీటిలోకి దిగి బాధితుల వద్దకు వెళ్లి సహాయక చర్యలు పర్యవేక్షించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలందరికీ ఆహార పదార్థాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

సోమవారం సాయంత్రం సింగ్‌నగర్ వరద ముంపు ప్రాంతాల్లో మరొక మారు వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు పర్యటించారు. వరద నీటిలోకి దిగి సహాయక చర్యల తీరు పరిశీలించి అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు తగు సూచనలు ఇచ్చారు. ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో ఆహార పంపిణీ సక్రమంగా చేపట్టాలని, ముంపు ప్రాంతాల్లో చిక్కుకుని ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

### అప్రమత్తంగా పశుసంవర్ధక, మత్స్య శాఖలు

మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో పశు సంవర్ధక శాఖ రాష్ట్ర వ్యాప్తంగా 175 వెటర్నరీ అంబులెన్స్‌లతో వరద ఉధృతికి ఇబ్బందులు పడుతున్న పశువులకు వైద్యం చేయడంతో పాటు వరద ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాల ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తోంది.మత్స్యశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించడంతో పాటు వరద ముంపు ప్రాంతాల్లో 163 బోట్లతో 187 మంది మత్స్యకారులతో సహాయక చర్యలు చేపట్టారు.

### పశువుల గల్లంతు విచారకరం

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి పెదలంకలో వరద ప్రవాహానికి 200 పాడి గేదెలు కొట్టుకుపోయిన దుర్ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల భారీ వర్షాలు, వరదల వల్ల 16 పశువులు, 64 గొర్రెలు, మేకలు, 34,500 కోళ్లు మృతి చెందాయని అధికారులు తెలిపారు. వరద ప్రవాహం పెరుగుతున్న ప్రాంతాల్లో నివాసాల నుంచి ఎవరూ బయటకు రావద్దని మంత్రి అచ్చెన్నాయుడు ప్రజలను కోరారు. వరద ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉన్న ప్రాంతాల నుంచి రైతులు, పశువులను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.







## తెలుగు రాష్ట్రాల్లో వరదలతో నష్టం కలచివేసింది

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విచారం

- ఇద్దరు సీఎంల సహాయనిధికి రూ.5 లక్షల చొప్పున సాయం
- కుమారుడు, కుమార్తె ఫౌండేషన్ల నుంచి రూ.10 లక్షలు
- స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని పిలుపు
- ఆదుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేసినట్టు వెల్లడి



అమరావతి(చైతన్యరథం): కుండపోత వర్షాలు, ఉధృతమైన వరదలతో ఏపీ, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో వాటిల్లుతున్న నష్టం తీవ్రంగా కలచివేసిందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితిని వివరించి వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. ఇద్దరు ముఖ్యమంత్రులతో ఇప్పటికే మాట్లాడానని, అక్కడి ప్రభుత్వ యంత్రాంగం, కేంద్ర అధికారులు టచ్‌లోనే ఉన్నారని ప్రధానమంత్రి తనకు చెప్పినట్టు వెంకయ్య వివరించారు. రెండు రాష్ట్రాలకు తగిన సహాయ సహకారాలు అందజేస్తామని కూడా హామీ ఇచ్చారు. నా వంతు సాయం వ్యక్తిగత పెన్షన్ నుంచి ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షల చొప్పున పంపించినట్టు తెలిపారు. ఈ కష్టకాలంలో ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని విజ్ఞప్తి చేశారు. యువత కూడా పెద్దఎత్తున ముందుకు వచ్చి సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరపున ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5లక్షలు అందజేసినట్టు చెప్పారు. కుమార్తె దీపా వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు అందజేసినట్టు చెప్పారు.

## విజయవాడ, గుంటూరు, రేపల్లెలోని
## నా క్యాంపు కార్యాలయాలను పునరావాస కేంద్రాలుగా వాడుకోవాలి

- రెవెన్యూ అధికారులు తక్షణమే కరకట్టల మరమ్మతు పనులు చేపట్టాలి
- కట్టలు బలహీనంగా ఉన్నచోట్ల పటిష్టతపై దృష్టి పెట్టాలి
- మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం):భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైతే విజయవాడ, గుంటూరు, రేపల్లెలోని తన క్యాంపు కార్యాలయాలను పునరావాస కేంద్రాలుగా ఉపయోగించుకోవాలని అధికారులకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. గతంలో వరదల వల్ల కోతలకు గురైన కరకట్టల మరమ్మతు పనులను రెవెన్యూ అధికారులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా పలుచోట్ల కరకట్టలు దెబ్బతిన్నాయి.వర్షాలు తగ్గుముఖంపట్టిన చోట్ల కరకట్ట పనులను వెంటనేచేపట్టాలి. కరకట్టలు బలహీనంగా ఉన్నచోట్ల కట్ట పటిష్టంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. కట్ట కింద ఉండే గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయం చేసుకోవాలి. భారీ వర్షాలు, వరదల సమయంలో నదీ తీర గ్రామాల ప్రజలు ముంపు బారిన పడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని కరకట్టల పటిష్టతపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ఇప్పుడు మరింత ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో మరమ్మతు పనులు చేపడుతూనే తీర గ్రామాల వెంబడి మరిన్ని కరకట్టలను నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలి. ఈ వర్షాల వల్ల పాము కాట్లకు గురయ్యే ప్రమాదం ఉంది. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ పాము కాటు మందులను అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి అనగాని సూచించారు.

చైతన్యరథం

# ముంపు ప్రాంతాల్లో డ్రోన్లతో ఆహారం, మందులు



విజయవాడ: వరద ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్లను రంగంలోకి దింపారు. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల ద్వారా ఆహారం, ఔషధాలు, తాగునీరు వంటివి అందించారు. బోట్లు, హెలికాప్టర్లు సైతం వెళ్లలేని ఇరుకు ప్రాంతాల్లో ఆహార సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాల్లో భాగంగా ఈ డ్రోన్ల వినియోగించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న మూడు డ్రోన్లతో విజయవాడ కలెక్టరేట్ వేదికగా తొలుత ట్రయల్ రన్ నిర్వహించారు. ఓ మినీ హెలికాప్టర్లా ఉండే ఈ డ్రోన్లు ఎంత బరువును మోయగలవు? ఏయే ప్రదేశాల వరకు వెళ్లగలవు? మార్గంలో ఎక్కడైనా చెట్లు, స్తంభాలు వంటివి వస్తే ఎలా తప్పించుకొని వెళ్లి రాగలవు? తదితర అంశాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబు స్వయంగా ఈ ట్రయల్ రన్‌ను పర్యవేక్షించారు. ఈ ట్రయల్ రన్ తర్వాత దాదాపు 8 నుంచి 10 కిలోల వరకు ఆహారం, మెడిసిన్, తాగునీరు వంటివి తీసుకెళ్లొచ్చని అంచనాకు వచ్చారు.





## హరికృష్ణ సేవలు మరువలేనివి

**- సీఎం చంద్రబాబు నివాళి**

అమరావతి(చైతన్యరథం): స్వర్గీయ నందమూరి హరికృష్ణ 68వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. సినీ నటుడుగా, రాష్ట్ర మంత్రిగా, రాజ్యసభ సభ్యుడుగా, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడుగా ఆయన అందించిన సేవలను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరన్నారు. జీవితపు ఆఖరు క్షణం వరకూ అందరికీ ఆత్మీయుడుగా మెలిగిన ఆయన ప్రజా హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు.

## మాకు స్ఫూర్తి హరి మావయ్య

**- మంత్రి లోకేష్ నివాళి**

అమరావతి(చైతన్యరథం): దివంగత నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. హరి మావయ్య జయంతి సందర్భంగా ఘన నివాళు లర్పిస్తున్నాను. తాత నందమూరి తారక రామారావు నట వారసత్వం అంది పుచ్చుకుని నటుడిగా రాణించారు. చైతన్య రథసారథిగా తాతయ్యతో రాజకీయ ప్రయాణం ఆరంభించిన హరి మావయ్య ధైర్యానికి చిరునామా, మాకు స్ఫూర్తి అని మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కర్నూలు జిల్లా టాప్

**- వరుసగా రెండు నెలలు అగ్రస్థానంలో**

కర్నూలు: సెప్టెంబర్ మాసంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో 99.47 శాతంతో కర్నూలు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లాలో మొత్తం 2 లక్షల 42 వేల 583 పెన్షన్‌లు ఉండగా అందులో 2 లక్షల 41 వేల 293 పెన్షన్‌లను పంపిణీ చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. గత ఆగస్టు నెలలో కూడా పెన్షన్ల పంపిణీలో 98.03 శాతంతో జిల్లా రాష్ట్రంలో టాప్‌లో నిలిచింది. వరుసగా రెండు నెలలూ పెన్షన్ల పంపిణీలో జిల్లా అగ్రస్థానంలో నిలవడం విశేషం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డెత్ కేసులు తీసివేయడం, 50 మందికి ఒక పెన్షన్ పంపిణీ అధికారిని నియమించుకోవడం, పెన్షన్ దారులకు ముందుగా సమాచారం అందించడం వంటి ప్రణాళికా బద్ధమైన చర్యల వల్ల పెన్షన్ల పంపిణీలో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తోంది.

## ఒకే రోజు 3 లక్షల మందికి ఆహారం తయారీ

**- మంగళగిరి అక్షయపాత్ర రికార్డు**

అమరావతి(చైతన్యరథం): ముంపో బాధితులకు ఆహారం తయారీలో మంగళగిరి అక్షయ పాత్ర సంస్థ రికార్డు సృష్టించింది. సోమవారం ఒకేరోజు మూడు లక్షల మందికి ఆహారం తయారు చేసింది. వరద నీటిలో చిక్కుకున్న విజయవాడ వాసుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మూడు లక్షల మందికి ఒకేసారి భోజనం ప్యాకెట్లు తయారు చేసి పంపించింది. అక్షయపాత్ర సర్వీసులో ఇదే రికార్డు.

### విజయవాడ ముంపు బాధితులకు తూ.గో జిల్లా నుంచి ఆహారం, పాలు

రాజమహేంద్రవరం: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆహార పదార్థాలు, వాటర్ ప్యాకెట్లు, పాలు, బ్రెడ్, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు పంపుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. సోమవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛంధ సంస్థలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఇప్పటికే విజయవాడకు 20 వేల పాల ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ ప్యాకెట్స్, 10 వేల పులిహోర పొట్లాలు, 20 వేల అగ్గిపెట్టెలు, 20 వేల కొవ్వొత్తులు, 75 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 50 వేల బ్రెడ్ ప్యాకెట్లు పంపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆహార పదార్థాలు, పాల ప్యాకెట్లు తీసుకుని వెళ్లే వాహనాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. సహాయ, పునరావాస కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 5న అల్ప పీడనం

**రాష్ట్రానికి మళ్లీ వర్ష గండం**

అమరావతి: ఏపీలో మళ్లీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది.. సెప్టెంబర్ 5 తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే సూచనలున్నాయని తెలిపింది. కోస్తాంధ్ర తీరాన్ని ఆనుకొని ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో ఏపీలో మళ్లీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు పేర్కొంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా మచిలీపట్నం వరకు రుతుపవన ద్రోణి ఆవరించి ఉండనున్నట్లు అంచనా వేసింది. ఇప్పటికే పలుచోట్ల కురుస్తోన్న భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీట మునిగి ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

## వరద సహాయ చర్యలకు రూ.1 కోటి విరాళం

**సీఎం చంద్రబాబుకు అందించిన ఎన్ఆర్ఐ గుత్తికొండ శ్రీనివాస్**



విజయవాడ (చైతన్య రథం): కృష్ణా వరదలతో ముంపు బాధితులు పడుతున్న ఇబ్బందులను చూసి ఎన్ఆర్ఐ, పారిశ్రామికవేత్త గుత్తికొండ శ్రీనివాస్ చలించిపోయారు. బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయంలో భాగస్వామి అయ్యేందుకు సీఎం సహాయ నిధికి విరాళం అందించారు. ఈమేరకు సోమవారం సీఎం చంద్రబాబునాయుడుని విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో కలిసి రూ.1 కోటి చెక్కును అందించారు. వరద బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు తనను ఎంతో బాధకు గురి చేశాయని, వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో పాలుపంచుకునేందుకు విరాళం అందించానని శ్రీనివాస్ అన్నారు. ధార్మిక కార్యక్రమాలకు శ్రీనివాస్ ఎక్కువగా విరాళాలు ఇస్తారని, గతంలోనూ కాణిపాకం దేవాలయాభివృద్ధికి రూ.18 కోట్లు అందజేశారని సీఎం చంద్రబాబు అన్నారు. విపత్తు సమయంలో ముందుకొచ్చి విరాళం అందించినందుకుగాను శ్రీనివాస్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

## జగన్ ప్రభుత్వం బకాయిపెట్టిన ఆయాలు, వాచ్‌మెన్ల జీతాలు విడుదల

అమరావతి(చైతన్యరథం): నాడు-నేడు పేరుతో భవనాలకు రంగులు వేసి వేలకోట్లు దిగమింగిన వైసీపీ పాలకులు పాఠశాలల్లో ఆయాలు, వాచ్‌మెన్లకు జీతాలు బకాయిపెట్టడంతోపాటు, టాయ్‌లెట్ క్లీనింగ్ మెటీరియల్‌కు కూడా నిధులు ఇవ్వకుండా వెళ్లిపోయారు. ఇటీవల పాఠశాల విద్యపై నిర్వహించిన సమీక్షలో ఈ విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి అధికారులు తేవడంతో ఆయన విస్మయం వ్యక్తంచేశారు. సంబంధిత బకాయిలను వెంటనే విడుదల చేయాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. ఆయాలు, వాచ్ మెన్ల జీతాలకు రూ.64.38 కోట్లు, టాయ్‌లెట్ క్లీనింగ్ మెటీరియల్ బకాయిలు 23.52 కోట్లు మొత్తంగా 87.9 కోట్ల విడుదల చేస్తూ సోమవారం ప్రభుత్వం జి.ఓ నెం. 413 విడుదల చేసింది.

చైతన్యరథం

# శాంతిస్తున్న కృష్ణమ్మ!



- తగ్గుముఖం పట్టిన ఉగ్రవరద ఉధృతి
- క్రైసిస్ మేనేజ్‌మెంట్‌లో సర్కారు సక్సెస్
- 48 గంటలపాటు వరదప్రాంతాల్లోనే సీఎం
- ప్రభావిత ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు
- సహాయక చర్యలపై అనుక్షణం సమీక్షలు
- ఫలించిన చంద్రబాబు సత్వర చర్యలు
- ప్రాణ నష్టాన్ని నివారించగలిగిన యంత్రాంగం
- పునరావాస కేంద్రాలకు తరలుతున్న బాధితులు
- క్రమంగా తేరుకుంటున్న వరద ప్రాంతాలు

అమరావతి (చైతన్య రథం): పరీవాహక ప్రాంతాలను బెంబేలెత్తించిన వరద కృష్ణమ్మ.. సోమవారం మధ్యాహ్నం నుంచి శాంతించం మొదలుపెట్టింది. క్యాచ్‌మెంట్ ఏరియాలో అధిక వర్షాలు తగ్గుముఖం పట్టడంతో.. కృష్ణమ్మ వరద ఉధృతి సైతం క్రమంగా తగ్గుముఖం పట్టింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి క్రమంగా వరద తగ్గుతున్నట్టు అధికార్లు ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు రికార్డుస్థాయిలో ప్రకాశం బ్యారేజీకి 11.43 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో.. దిగువప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఒకదశలో ప్రకాశం బ్యారేజ్ రైలు వంతెన పైనుంచి కృష్ణమ్మ పారే అవకాశం ఉందన్న అంచనాలూ వినిపించాయి. అయితే.. క్రమంగా ప్రకాశం బ్యారేజ్‌కు ఇన్ ఫ్లో తగ్గడంతో, దిగువకు వదిలే వరద నీరు సైతం తగ్గుముఖం పట్టింది. కడపటి వార్తలు అందే సమయానికి ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణా ఇన్ ఫ్లో 11.14 లక్షల క్యూసెక్కులకు చేరినట్టు అధికార్లు వెల్లడించారు. ప్రస్తుత వరద ప్రవాహం అర్ధరాత్రి సమయానికి మరింత తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసోంది. ఇదే సమయంలో బుడమేరు ఇన్ ఫ్లో 4 వేల క్యూసెక్కులే ఉందంటూ జలవనరుల శాఖ సైతం ప్రకటించింది. ప్రకాశం బ్యారేజ్ నుంచి కాలువలకు 801 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ మొత్తం 70 గేట్లు తెరిచి సముద్రంలోకి నీరు విడుదల చేస్తున్నా.. ప్రకాశం బ్యారేజ్ వద్ద 23.7 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో అపార అనుభవమున్న ముఖ్యమంతి చంద్రబాబు.. పరిస్థితిని ముందే అంచనావేసి చేపట్టిన యాజమాన్య నిర్వహణ అద్భుత ఫలితాలిచ్చింది. కృష్ణమ్మ ఉగ్రవరద ఉధృతిని ముందుగానే అంచనా వేసిన చంద్రబాబు.. ఆదివారం స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టారు. ఉగ్ర కృష్ణ కారణంగా ప్రకాశం బ్యారేజీ 70గేట్లు ఎత్తివేయడంతో.. లోతట్టు ప్రాంతాలు భారీగా ముంపునకు గురయ్యాయి. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సోమవారం తెల్లవారుఝాము వరకూ వరద ప్రాంతాల్లో పర్యటించి ముంపు బాధితులకు ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి, సోమవారం రాత్రి సమయం వరకూ సమీక్షల మీద సమీక్షలు నిర్వహించారు. ఒకవైపు వరద ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తూనే.. సహాయ కార్యక్రమాలను వేగవంతం దేశారు. అంతకుముందే కేంద్రానికి పరిస్థితిని వివరించి బోట్లు కావాలని అడిగిన చంద్రబాబు.. ఆగమేఘాల మీద వాటిని వరద ప్రాంతాలకు రప్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి పవర్ బోట్లు విజయవాడకు చేరడంతో సహాయక కార్యక్రమాలు సులువైంది. ప్రధానంగా బోట్లు ద్వారా సింగ్‌నగర్ ముంపు ప్రాంతాల్లో ఆహారం పంపిణీ సాధ్యమైంది. పవర్ బోట్లు సాయంతో వరదలో చిక్కుకున్న ఇళ్ల నుంచి బాధితులను బయటకు తెచ్చే పనులు వేగవంతమయ్యాయి. ముంపునుంచి బయటకు తీసుకొచ్చిన ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

ముంపు భాదిత ప్రాంతాల్లో ప్రభుత్వం సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టింది. విజయవాడ ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సుడిగాలి పర్యటనలు జరిపి.. ఎప్పటికప్పుడు.. ఎక్కడికక్కడ పరిస్థితిని సమీక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు, పదేపదే సమీక్షల నేపథ్యంలో.. సహాయక చర్యలను అధికార యంత్రాంగం పరుగులు పెట్టించింది.

ఏపీ విపత్తుల నిర్వహణా సంస్థ కమాండ్ కంట్రోల్ రూంనుంచి విడుదల చేసిన సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో ఇంతవరకు వర్షాలు, వరదల కారణంగా 19మంది మరణించారు. ఇద్దరు గల్లంతయ్యారు. 136 పశువులు, 59,700 కోళ్లు మరణించాయి. 134 పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 6 వేల పశువులకు వ్యాక్సిన్ అందించడం జరిగింది. అధిక వర్షాల కారణంగా 1808 కిమీ పొడవున ఆర్ అండ్ బి రోడ్లు దెబ్బతిన్నాయని అంచనా వేస్తున్నారు. 1,72,542 హెక్టార్లలో వరి పంట, 14,959 హెక్టార్లలో ఉద్యానవన పంటలు నీట మునిగాయి. భారీ వరదలో ముంపునకు గురైన ప్రాంతాల నుంచి 41927 మందిని సురక్షిత ప్రాంతాలకు తీసుకొచ్చి 176 పునరావాస కేంద్రాల్లో అవాసం కల్పించారు. వరదప్రాంత ప్రజలు ఎలాంటి వ్యాధులబారిన పడకుండా.. 171 వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. సహాయక చర్యల్లో 36 కేంద్ర బృందాలు నిరంతర సేవలు అందిస్తున్నాయి. బాధితులకు ఒక్క సోమవారమే 3 లక్షల ఆహార ప్యాకెట్లు, త్రాగునీరు ఎప్పటికప్పుడు అందించారు. వరద ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహారం అందించేందుకు ఐదు హెలికాప్టర్లు, భారీగా డ్రోన్లను ఉపయోగించారు. ప్రాణనష్టం సంభవించకుండా 188 బోట్లు, 283 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎటువంటి సహాయనికైనా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101కి సమాచారం అందించవచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.

ఇదిలావుంటే, కేంద్రం నుంచి విజయవాడకు ప్రత్యేకంగా 10 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. తమిళనాడు నుంచి 3, పంజాబ్ నుంచి 4, ఒడిశా నుంచి 3 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు పవర్ బోట్లు, రెస్క్యూ పరికరాలతో చేరాయి. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లా సహాయచర్యల్లో 8 ఎన్డీఆర్‌ఎఫ్, 10 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్స్‌లో పాలు పంచుకున్నాయి.

### వరదలో చిక్కుకున్న హోంమంత్రి నివాసం

విజయవాడ రామవరప్పాడు వంతెన కింద కాలనీలో నివాసముంటున్న హోంమంత్రి వంగలపూడి అనిత నివాసాన్ని వరదనీరు చుట్టుముట్టింది. దీంతో తన పిల్లల్ని ట్రాక్టర్ ఎక్కించి సురక్షిత ప్రాంతానికి తరలించిన మంత్రి, వరద ముంపులోనే తానుండే నివాసం ఉన్నా, పట్టించుకోకుండా సహాయక చర్యల్లో నిమగ్నమవ్వడం విశేషం. మంత్రి ఇంటి వద్దకు విపత్తు నిర్వహణ శాఖ బృందం చేరుకున్నా.. తన ఇంటి వద్దకంటే ముంపు ప్రాంతాల్లో ముందు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి ఆదేశించారు. కాలనీలో ఇతర కుటుంబాలను రక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటు చేసిన మంత్రి అనిత.. తన ఇంటి కోసం వచ్చిన సహాయ బృందాన్ని సింగ్‌నగర్‌వైపు పంపించారు.

### ప్రవాహానికి అడ్డుపడిన బోట్లు

భారీ వరద కారణంగా ఎగువ ప్రాంతంలో ఇసుకను తవ్వే నాలుగు బోట్లు కొట్టుకొచ్చి బ్యారేజ్ గేటు నెంబర్ 69వద్ద చిక్కుకున్నాయి. దీంతో బ్యారేజ్ వెయిట్స్ స్వల్పంగా దెబ్బతింది. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై పరిస్థితిని సమీక్షించారు. సోమవారం సాయంత్రం ప్రవాహ ఉధృతిని పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఆ ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే గతంలో కూడా చంద్రబాబు నివాసాన్ని ముంచేందుకు బోటు అడ్డుతగిలిందంటూ నీటి ప్రవాహాన్ని పెంచే ప్రయత్నం చేసిన గత ప్రభుత్వం -ఇప్పుడు కూడా బ్యారేజీని డ్యామేజీ చేయడానికి అలాంటి ప్రయత్నం ఏమైనా జరిగిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రమాదంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

### వరద ప్రాంతాల్లో సిసోడియా

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్పీ సిసోడియా విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం విస్తృతంగా పర్యటించారు. బాధితులకు ప్రభుత్వం తరపున భరోసా కల్పిస్తూ యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా సహాయక చర్యలు చేపట్టడం జరుగుతోందని ఈ సందర్భంగా తెలిపారు.

## వరద సహాయ చర్యల్లో పాల్గొనండి: లోకేశ్ పిలుపు

ఇదిలావుంటే, వరద సహాయ చర్యల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని తమ పార్టీ శ్రేణులకు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపు నిచ్చారు. దీంతో మంగళవారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతోపాటు సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సహాయ కార్యక్రమాలను పార్టీ నేతలు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు, ప్రకాశం బ్యారేజీ భద్రతపై ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా.. పిఠాపురం నియోజకవర్గం తెదేపా ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ వరద బాధితుల కోసం తన వంతు సహకారం అందిం చారు. విజయవాడ వరద బాధితుల కోసం దాదాపు 5. టన్నుల కూరగాయాలను పంపించారు. మరికొద్దిసేపట్లో ప్రాజెక్టు గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు విజయవాడకు రానున్నారు. కొటికలపూడిలో కృష్ణానది వరదలో చిక్కుకున్న 21మందిని హెలి కాప్టర్ ద్వారా కాపాడిన ఎన్టీఆర్ ఎఫ్ బృందాలు.. వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. విజయ వాడ డివిజన్‌లో 42 పున రావాస కేంద్రాల్లో వరద బాధిత ప్రజలకు ఆశ్రయం కల్పించడంతో పాటు వారికి ఆహారం, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేశారు.

చైతన్యరథం

# జనానికి కష్టం వస్తే క్షణం ఆగడు!

- నిర్విరామ శ్రామికుడు చంద్రబాబు
- తెల్లవార్లూ వరద నీటిలోనే
- ముంపు బాధితులకు భరోసా
- అర్ధరాత్రి వేళా పడవలో వరద నీటిలోనే
- బాధితులకు స్వయంగా ఆహారం పంపిణీ
- రోజు మొత్తంలో రెండు గంటలే విశ్రాంతి

విపత్తు సమయాల్లో స్పందించే తీరును బట్టే నాయకుడిలో సత్తా బయటపడుతుంది. ప్రజలను ఆదు కోవటంలో వేగంగా ఆలోచించి, క్షణాల్లో నిర్ణయాలు తీసుకోవటంలోనే నాయకుడి సామర్థ్యం తెలుస్తుంది. ఎంతటి ఉపద్రవం ముంచుకొచ్చినా అడుగు బయట పెట్టకుండా, ఒకవేళ వెళ్లినా గాల్లోనే విహరించి వచ్చే జగన్‌రెడ్డి ఎక్కడ...విపత్తు సమయాల్లో వెంటనే బాధితుల మధ్యకు వెళ్లిపోయి, వారికి తక్షణ సాయం అందించటంలోనూ, పరిస్థితిని చక్కదిద్దడంలోనూ మెరుపు వేగంతో స్పందించే సీఎం చంద్రబాబు ఎక్కడ... అసలు చంద్రబాబుతో పోల్చేందుకే జగన్ రెడ్డి అనర్హుడు. ఈ విషయం విజయవాడలో బుడమేరు ముంపుతో మరోసారి రుజువయింది. చంద్రబాబు నాయుడి పనితీరు విజయవాడ వాసులకు ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది.

గత శనివారం నుంచి వాయుగుండం ప్రభావం వల్ల కురిసిన అతి భారీవర్షాలతో విజయవాడ నీట మునిగింది. రాష్ట్ర చరిత్రలో 121 సంవత్సరాలు తరువాత ఇంతటి భారీ స్థాయిలో వరదలు రావడం ఇదే తొలిసారి. కృష్ణా నదికి 1903లో 11.90 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. తరువాత 2009లో 11.10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రస్తుతం 11.50 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చిందని అంచనా వేశారు. ఇంతటి విపత్తులో కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముంపు ప్రాంతాలను పర్యవేక్షించి వరద బాధితులకు భరోసా కల్పించారు. తెల్లవారుజాము నాలుగు గంటల వరకు వరద ప్రాంతాల్లో పర్యటించారు. ఆ సమయంలో పడవలో తిరుగుతూ బాధితులకు ఆహారం ఆందజేశారు. తరువాత కేవలం రెండు గంటలు మాత్రమే విశాంత్రి తీసుకొని వెంటనే ఉదయం ఆరు గంటలకల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తూ వరద ప్రాంత బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించటంతో సీఎం చంద్రబాబు తన మార్క్ చూపించారు.



వరద ప్రాంతాల ప్రజలకు అండగా సీఎం

బుడమేరు పొంగడంతో విజయవాడ నగరంలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దాదాపు 2.76 లక్షల మంది వరద ముంపులో చిక్కుకున్నారు. శనివారం రాత్రి నుంచి ఆహారం.. తాగునీరు లేకుండా బిక్కుబిక్కుమంటూ నీటిలో చిక్కుకున్న బాధితులకు సీఎం చంద్రబాబు నాయుడు అండగా నిలిచారు. ఆదివారం ఉదయం 8 గంటలకల్లా దాదాపు 2.50లక్షల మందికి ఆహారం, తాగునీరు, పండ్లు, బిస్కెట్‌లు అందించారు. అలాగే ముంపు ప్రాంత బాధితులను తరలించడానికి ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 100 పునరావాస కేంద్రాలు, 61 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసిన ప్రభుత్వం. వరద కారణంగా విద్యుత్ నిలిచిపోవడంతో వరద బాధితులకు కొవ్వొత్తులు పంపిణీ చేసి అండగా నిలిచింది. వరద బాధితుల సమస్యలపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్ 112 లేదా 1070 ఏర్పాటు చేసి వారిలో మనోధైర్యాన్ని కల్పించారు. 1996లో తూర్పు గోదావరిలో సూపర్ సైక్లోన్, 2014లో విశాఖలో హుద్‌హుద్ తుపాన్ వచ్చినప్పుడు పరిస్థితులు చక్కబడే వరకు అక్కడే ఉండి సహాయ, పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించిన నాయకుడు చంద్రబాబు. మళ్లీ నేడు అలాంటి పరిస్థితే వచ్చింది. ఇలాంటి పరిస్థితులు.. వాటిని ఎదుర్కోవడం అయనకు కొత్తేమీ కాదు.

## ఫలించిన సీఎం చంద్రబాబు ప్రయత్నాలు

ముంపు ప్రాంత ప్రజలను రక్షించడానికి కేంద్రం సహాయంతో 40 పవర్ బోట్లు, 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 6 హెలికాప్టర్లను రప్పించి, వేలాదిమంది ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించ డంలో చంద్రబాబు నాయుడు చూపించిన చొరవ అనితర సాధ్యం. అలాగే 109 ప్రైవేట్ బోట్లు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. అలాగే డ్రోన్ల ద్వారా 8-10 కిలోల వరకు ఆహారం, మందులు పంపిణీ చేస్తున్నారు.

## వైసీపీ దుష్ప్రచారం

బుడమేరు పొంగడం వల్ల విజయవాడలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దీంతో చంద్ర బాబు స్వయంగా రంగంలోకి దిగి సహాయ చర్యలను పర్యవేక్షించారు. అయితే చంద్రబాబు నివాసం ముంపునకు గురైంది..అందుకే వరద సహాయక చర్యల పేరుతో కలెక్టర్ కార్యాలయంలో బస ఏర్పాటు చేసుకున్నారని సాక్షి దినపత్రికలో తప్పుడు రాతలు రాశారు. వాస్తవానికి సైకో జగన్ తన ఐదేళ్ల దుర్మార్గ పాలనలో ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిని ముంచే యాలని ఎన్నో కుట్రలు చేశాడు. ప్రకాశం బ్యారేజీలో వరద నీరు దిగువకు వెళ్లకుండా గేట్లకు పడవను అడ్డుపెట్టి చంద్రబాబు ఇంటిని ముంచేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. అయినా చంద్రబాబు ఇల్లు మునగలేదు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ఉండవల్లి నివాసం మునిగిపోయింది అంటూ సైకో జగన్ ముఠా ఫేక్ ప్రచారం సాగిస్తోంది. వాస్తవంగా అమరావతి పరిధిలో ఒక్క గ్రామం కూడా ముంపులో లేదు. సహా యక చర్యల్లో ఎలాంటి లోటు ఉండకూడదని సీఎం చంద్రబాబు స్వయంగా కలెక్టర్ కార్యాలయం నుంచి సమీక్షలు నిర్వహించారు. అలాగే మంత్రుల ద్వారా వేగంగా ముంపు బాధితులకు సాయం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ బ్లూ మీడియా మాత్రం ఫేక్ ప్రచారం చేస్తోంది. గత ప్రభుత్వంలో 2019 ఆగస్టు 14-19 తేదీల్లో గోదావరి వరదల సమయం లో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యాడు. వరదలు వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతుంటే జగన్ రెడ్డి మాత్రం అమెరికా పర్యటనకు వెళ్లాడు. ఈవరదల్లో దాదాపు 276గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. వేలాది హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అలాగే 18,678 ఇళ్లు నీట మునిగాయి. అమెరికా నుంచి వచ్చిన నేలమీద కాలు మోపకుండా జగన్మోహన్ రెడ్డి కేవలం హెలికాప్టర్ నుంచి కేవలం గాల్లోనే సర్వే చేశారు. నేడు చంద్రబాబు నాయుడు స్వయంగా ముంపు ప్రాంతాలకు వెళ్లి వరద బాధితులకు అండగా నిలిచారు.

శనివారం రాత్రి నుంచి వరద ప్రాంతాల్లో పడవల్లో తిరుగుతూ బాధితులకు భరోసా కల్పించారు. వరద నీటిలో గంటలకొద్దీ నడిచి బాధితులను కష్టాలను తెలుసుకుని, అందుకు తగ్గట్టుగా సహాయక చర్యలు చేపట్టారు.

## వరదలకు కారణం జగన్ రెడ్డే

విజయవాడలో వరదలు రావడానికి కారణం జగన్ రెడ్డి గత 5 ఏళ్ళుగా చేసిన పాపాలే. బుడ మేరుకు ఈ స్థాయి వరదలు గతంలో రాలేదు. అందు వల్లే ముందస్తుగా ముంపు సూచనలు రాలేదు. ఈ వరదల వల్ల గత 5 ఏళ్ళలో జగన్‌రెడ్డి చేసిన బాగోతా లు బయట పడ్డాయి. జగన్ పాలనలో విజయవాడ శివారు ప్రాంతంలో బుడమేరు పరీవాహక ప్రాంతం ఆక్రమణలకు గురైంది. ఇష్టం వచ్చినట్టుగా బుడమేరు కట్టలు, సమీప భూములు కబ్జా చేసి, వైసీపీ నేతలు అమ్ముకున్నారు. దీంతో బుడమేరు కుంచించుకుని పోయింది. ఫలితంగానే,నేడు విజయవాడకు ఈస్థాయి వరద వచ్చింది. జగన్ రెడ్డి పాపాలు, భావితరాలకు శాపాలుగా మారాయి.

## చంద్రబాబు హయాంలోనే రిటైనింగ్ వాల్

వర్షాకాలం వచ్చిందంటే విజయవాడ కృష్ణానది ఒడ్డున ఉన్న కృష్ణలంక, రామలింగేశ్వరనగర్, యనమలకుదురు, పెనమలూరు ప్రాంతాల ప్రజలు ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి ఉండేది కాదు. 2014లో వచ్చిన వరదల సమయంలో పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ఈ ప్రాంత వాసుల కష్టాలు తొలగించేందుకు రిటైనింగ్ వాల్‌కి పునాది వేశారు. మొదటి దశను 2015-16లో మొదలు పెట్టారు. 2019 నాటికి రిటైనింగ్ వాల్ పూర్తి చేశారు. దాదాపు 2.5 కి.మీ మేర మొదటి దశ రిటైనింగ్ వాల్ చంద్రబాబు హయాంలోనే పూర్తి చేశారు. కాంగ్రెస్ హయాంలో ఈ ప్రాజెక్టుకు తొలుత రూ.40 కోట్లు అంచనా వేయగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.104 కోట్లకు పెంచింది. 2014లో రూ.104 కోట్ల పనులకు ప్రభుత్వం సాంకేతిక అనుమతులు ఇచ్చింది. తరువాత అంచనాలు పెరగటంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 138.78 కోట్లు కేటాయించింది. యనమలకుదురు నుంచి రామలింగేశ్వర నగర్ వరకు మొదటిదశ రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీడీపీ హయాంలోనే పూర్తి చేశారు. 2019లో ప్రభుత్వం మారడంతో అప్పటికే పూర్తయిన రిటైనింగ్ వాల్‌ను వైసీపీ ప్రభుత్వం నిర్మించినట్లు తప్పుడు ప్రచారం చేసుకున్నారు.

- ఎం. ఎలీషా, అనలిస్ట్

# వరదలో ప్రజలను ఆదుకోకుండా తప్పుడు ప్రచారమా?

- జగన్‌రెడ్డీ సిగ్గుందా...మానవత్వం లేకుండా వ్యవహరిస్తారా?
- ముంపు లేకపోయినా అమరావతిపై విషప్రచారం చేయిస్తారా?
- భయభ్రాంతులను చేయడమే రోత పత్రిక, బ్లూ మీడియా పని
- వందేళ్ల తరువాత భారీస్థాయిలో 11.37 లక్షల క్యూసెక్కులు
- అందరినీ అప్రమత్తం చేసి చంద్రబాబు రక్షకుడిగా నిలిచాడు
- ముందుండి సహాయక చర్యలు చేపట్టి భరోసా కల్పించారు
- డ్యాంలు కొట్టుకుపోయేలా చేసి ప్రాణాలు తీసిన చరిత్ర జగన్
- ఇప్పుడు కొట్టుకువచ్చిన బోట్లపై అనుమానం ఉంది...
- విచారణ చేయించి కుట్రకోణం ఉంటే చర్యలు తీసుకోవాలి
- తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి



మంగళగిరి(చైతన్యరథం): కష్టాల్లో ఉన్న ప్రజలకు సాయం చేయాల్సింది పోయి జగన్‌రెడ్డి వారిని భయపెడుతున్నాడని, లోకపత్రిక సాక్షి, బ్లూ మీడియాలలో విషప్రచారం చేయిస్తూ తప్పుడు రాతలు రాయిస్తున్నాడని తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మం డిపడ్డారు. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టు కుంభవృష్టితో వరద పోటెత్తి ఓ వైపు జనం ఇబ్బంది పడుతుంటే ఉల్లిగడ్డకు ఉర్లగడ్డకు తేడా తెలియని జగన్ రెడ్డి కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోగా అమరావతి మునిపోయిందంటూ అబద్దాలకు తెరలేపాడని ధ్వజ మెత్తారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశంలో జగన్‌రెడ్డిపై తప్పుడు ప్రచారంపై ఘాటుగా స్పందించారు. ఉమ్మడి కృష్ణా పరివాహక ప్రాం తంలో కుంభవృష్టి కురిసింది. వందేళ్లలో ఎన్నడూ లేనంతగా 28 సెంటీమీటర్ల వర్షం పడింది. దాంతోనే మున్నేరు, బుడమేరులకు వరద పోటెత్తింది. కానీ ప్రతిపక్ష పార్టీ ఇలాంటి విపత్కర సమయంలో కూడా అబద్ధాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. కనీస పరిజ్ఞానం లేకుండా జగన్ రెడ్డి సిగ్గు లేకుండా ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు. వరదతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మానవత్వాన్ని మరచి ప్రవర్తిస్తున్నారు. గతంలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు వరదలు వస్తే అతలాకుతలం అయ్యాయి. కానీ నేడు ఇంత వరద వచ్చినా అమరావతి మునగలేదని గుర్తుచేశారు.

## ఆదుకోవడానికి ముందుకు రాకుండా ఫేక్ ప్రచారాలా?

రాష్ట్ర భవిష్యత్‌పై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవుపలికారు. కష్టం వస్తే ఆదుకోవడానికి ముందుకు రాకుండా విషప్రచారం చేస్తారా? జగన్ రెడ్డికి అసలు సిగ్గు ఉందా? అని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి ధనదాహానికి అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి ప్రజల ప్రాణాలు పోయాయి. ప్రతిపక్షంలో ఉన్నా ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి నారా భువనేశ్వరి బాధితులను ఆదుకున్నారే కానీ.. వైసీపీ నేతల్లా ఎన్నడూ ఫేక్ ప్రచారం చేయలేదని తెలి పారు. 74 ఏళ్ల వయసులో కళ్లలో వత్తులు పెట్టుకుని ప్రజల కోసం ప్రభుత్వ యం త్రాం గాన్ని, పార్టీ నేతలను చైతన్య పరుస్తూ చంద్రబాబు వరద నీటిలో ప్రజల ప్రాణాలను రక్షిస్తుంటే.. ఆదుకోకుండా జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేయిస్తుండటాన్ని ప్రజలు గమని స్తున్నారని చెప్పారు.

## ప్రజలను రక్షించేందుకు చంద్రబాబు సాహసం చేశారు

అంత చీకట్లో కూడా బుడమేరు వల్ల ముంపునకు గురైన డివిజన్‌లలో ప్రతి వ్యక్తికి తాగునీరు, ఆహారం అందేలా చంద్రబాబు చర్యలు తీసుకున్నారు. కరెంట్ లేకపోయినా.. అధికారులు వద్దని వారించినా.. చీకటిని లెక్కచేయకుండా.. సెల్‌ఫోన్ లైట్లలోనే ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం చంద్రబాబు చేశారు. ప్రజలకు భరోసా కల్పించారు.

గతంలో గోదావరికి వరదలు వచ్చినప్పుడు... సాయం పేరుతో ఒక ఉల్లిగడ్డ రెండు ఉర్లగడ్డలు, నాలుగు టమాటాలు, ఎనిమిది పచ్చి మిరప గాయలు ఒక కొవ్వొత్తిని వరద బాధితుల చేతిలో పెట్టి చేతులు దులుపుకుని జగన్‌రెడ్డి ప్రజల ప్రాణాలు తీశాడని గుర్తుచేశారు. అది కూడా బాధితులందరికీ ఇవ్వలేదన్నారు.

పునరావాస కార్యక్రమాల్లో అండగా ఉండాల్సిన జగన్‌రెడ్డి ఎక్కడా సాయం చేయకుండా ప్రజలను భయపెట్టే చర్యలకు పాల్పడటం సిగ్గుమాలిన చర్య అన్నారు. కుంభవృష్టితో 11. 37 లక్షల క్యూసెక్కులతో వందేళ్ల తరువాత వరద పోటెత్తింది. నిద్రపోతున్న అధికారులను మేల్కొలిపి తానే ముందుండి ప్రజలను సహాయ చర్యలు చేపట్టిన గొప్ప నాయకుడు చంద్ర బాబు అని ప్రశంసించారు. ప్రకాశం బ్యారేజ్ వద్దకు వరదలో కట్టగట్టుకు కొట్టుకు వచ్చిన బోట్లపై అనుమానం ఉందన్న ఆయన దానిపై లోతైన విచారణ జరపాలని, ఎలాంటి కుట్ర కోణం ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# అన్ని వర్గాలకు అందుబాటులో వైద్య సేవలు

- పీపీపీ విధానంలో 175 ఆసుపత్రులు, మెగా హెల్త్‌సిటీ
- నియోజకవర్గానికో ఆసుపత్రి ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన
- ప్రభుత్వాసుపత్రుల్లో రోగనిర్ధారణ, చికిత్స సౌకర్యాల మెరుగుకు కృషి
- వైద్యారోగ్య రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు విశేషమైన అవకాశాలు
- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి
- రంగరాయ, సిద్ధార్థ, గుంటూరు వైద్య కళాశాలల పూర్వ విద్యార్థుల ద్వైవార్షిక సదస్సులో మంత్రి కీలకోపన్యాసం



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వర్గాల ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తెచ్చే విధంగా రాష్ట్ర వైద్యఆరోగ్య రంగాన్ని మెరుగుపర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆరోగ్య రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు విశేషమైన అవకాశం, సామర్థ్యాలు ఉన్నాయని చెప్పారు. అమెరికా లోని ఫ్లోరిడా నగరంలో స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం జరిగిన..రంగరాయ, సిద్ధార్థ, గుంటూరు వైద్య కళాశాలల పూర్వ విద్యార్థుల ద్వైవార్షిక సదస్సుకు మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. వారిని ఉద్దేశించి కీలకోపన్యాసం చేసిన ఆయన... ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య రంగంలో ఉన్న సవాళ్లు, అవకాశాల గురించి సుదీర్ఘంగా మాట్లాడారు. మారుతున్న ప్రజల ఆరోగ్య పద్ధతులు, పెరుగుతున్న ఆదాయాల కారణంగా... సమాజంలోని ఎక్కువ శాతంగా ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటు ధరలకే వైద్యం అందించేందుకు... ఉచిత వైద్యం అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, కార్పొరేట్ ఆసుపత్రులతో సహా ప్రైవేట్ ఆసుపత్రులకు భారీ అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. స్పెషాలిటీ హెల్త్‌కేర్ సేవలతో సహా పేద, అల్పాదాయ వర్గాలకు ప్రజారోగ్య సంరక్షణ సేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. వైద్య సేవల విషయంలో ప్రజలకున్న డిమాండ్లను తీర్చడంలో ప్రైవేట్ ఆసుపత్రులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, 'కార్పొరేట్ హెల్త్‌కేర్' పెద్దఎత్తున అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. అయితే అధిక ఖర్చుల కారణంగా ప్రైవేట్ వైద్యం ఎక్కువ మంది ప్రజలకు అందుబాటులో లేదని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. సరసమైన ధరలకే ఆరోగ్య సంరక్షణ సేవలకు ఉన్న డిమాండ్, సరఫరా మధ్య ఉన్న ఈ వ్యత్యాసాన్ని తగ్గించడానికి, రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో పెట్టుబడులను ప్రోత్సహించాలని యోచిస్తోందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య రంగంలో ఉన్న గణనీయమైన పెట్టుబడి అవకాశాలను ఆయన ఆవిష్కరించారు.

**నాటిలో కొన్ని...**

రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పీపీపీ విధానంలో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా... అందుబాటు ధరలకే వైద్య సేవలను ఆశించే అన్ని వర్గాల ప్రజలకు, వారి 'స్థోమత'కు తగిన ఆరోగ్య సంరక్షణను అందించవచ్చని, సరసమైన ధరలకే స్పెషాలిటీ సేవలతో సహా ఆరోగ్య సంరక్షణ సేవలను కల్పించవచ్చని చెప్పారు. దీనికి ఉదాహరణగా ఒక ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆసుపత్రి గురించి వివరించారు. నామమాత్రపు ఔట్ పేషెంట్ (ఓపీ) రుసుము మాత్రమే వసూలు చేస్తున్న ఆ ఆసుపత్రి... నాణ్యమైన సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ పద్ధతుల వల్ల ప్రస్తుతం ఉన్న సామర్థ్యానికి మరో 17,500 పడకలు జోడించవచ్చని వెల్లడించారు. ఈ ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరుస్తుందన్నారు.

రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమిలో మెగా మెడిసిటీని అభివృద్ధి చేస్తాం. కేంద్ర ప్రభుత్వం కూడా దీనిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహాయం చేస్తుంది. ఈ మెడిసిటీలోని పీపీపీ సిటీలో అనేక రకాల ఆరోగ్య సంరక్షణ సంబంధిత సంస్థలను ప్రోత్సహిస్తాం.

రాష్ట్రంలో మంజూరైన 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 10కళాశాలలు, అలాగే టీచింగ్ ఆసుపత్రులను కూడా పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే విధంగా పెద్ద ఎత్తున పెట్టుబడి అవకాశాలను పెంచుతాం.

మెరుగైన సేవలు అందించడం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వివిధ రోగనిర్ధారణ పరికరాలు, అలాగే యంత్రాల డిమాండ్ - లభ్యత మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. దీంతో క్యాథ్ ల్యాబ్‌లు, సీటీ స్కాన్‌లు, ఎమ్ఆర్ఐ, క్యాన్సర్ డయాగ్నస్టిక్ మెషీన్ల ఏర్పాటులో ప్రైవేటు పెట్టుబడులకు అనుమతి ఉంటుంది.

అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల పనితీరులో మార్పు తీసుకురావడానికి, అలాగే విస్తృతమైన సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు, వీటికి పెద్ద సంఖ్యలో వచ్చే సామాన్య ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడానికి ఇటీవల రూపొందించిన 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికను కూడా ఆరోగ్య మంత్రి వివరించారు.

గుంటూరు మెడికల్ కాలేజ్, రంగరాయ మెడికల్ కాలేజ్ (కాకినాడ) సిద్దార్థ మెడికల్ కాలేజ్ (విజయవాడ), ఇతర ప్రభుత్వ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ అభినందించారు.త ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## రానున్న రోజుల్లో మరిన్ని అద్భుతాలు చేయాలి

- డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు

అమరావతి(చైతన్యరథం): ప్రజా జీవితంలో నిబద్ధతతో ఉండే నాయకుడిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరిన్ని మైలురాళ్లు దాటాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. జనసేనాని పవన్ కల్యాణ్ పుట్టినరోజు సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. చలనచిత్ర సీమలో తిరుగులేని కథానాయకుడిగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న పవన్ కల్యాణ్... రానున్న రోజుల్లో మరిన్ని అద్భుతాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అందుకు ఆ భగవంతుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆశిస్తున్నాను" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. పవన్ తో తాను కలిసున్న ఫొటోను కూడా పంచుకున్నారు.

## నాకు దేవుడిచ్చిన అన్నయ్య..

**డిప్యూటీ సీఎం పవన్‌కు మంత్రి లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు**



అమరావతి(చైతన్యరథం): జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్ రియల్ హీరో అంటూ ఈ సందర్భంగా లోకేష్ కొనియాడారు. ఎక్స్ వేదికగా లోకేష్ స్పందిస్తూ 'రియల్ హీరో పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నటనతో ప్రేక్షకుల హృదయాలు గెలుచుకుని పవర్ స్టార్‌గా నిలిచావు. రాజకీయాల్లో ప్రజల అభిమానాన్ని చూరగొని డిప్యూటీ సీఎంగా నవ్యాంధ్ర పునర్నిర్మాణంలో భాగమయ్యావు. నాకు దేవుడిచ్చిన అన్నయ్య పవన్ కళ్యాణ్...ఆయురారోగ్యాలతో వందేళ్లు వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ... హ్యాపీ బర్త్ డే పవన్ అన్న' అని ట్వీట్ చేశారు.

## బెంగళూరు టీడీపీ ఫోరం 11 ఏళ్ల సంబరాలు

- నవశకం-మంచిరోజులు వచ్చేశాయి పేరుతో కార్యక్రమం
- ముఖ్యఅతిథులుగా మంత్రి సవిత, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు
- పార్టీ కోసం సేవలందిస్తున్న ప్రతినిధులకు ప్రశంసలు



బెంగళూరు(చైతన్యరథం): బెంగళూరు టీడీపీ ఫోరం స్థాపించి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బెంగళూరులోని ఎంటీబీ సుభమేరు కళ్యాణ మండపంలో "నవశకం" మంచిరోజులు వచ్చేశాయి పేరుతో వార్షికోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి సవితమ్మ, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గురజాల జగన్, అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమా లలు వేశారు. తెలుగు ప్రజలకు ఎనలేని సేవలందించిన రామోజీరావుకు నివాళులర్పించా రు. అనంతరం బెంగళూరు టీడీపీ ఫోరం 11 సంవత్సరాల పాటు సాగిన ప్రయాణంపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. గత ప్రభుత్వ అరాచక పాలన, కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న మంచిని తెలిపేలా రూపొందించిన "నవశకం" వీడియో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**ఫోరం సేవలను ప్రశంసించిన మంత్రి**

మంత్రి సవితతో పాటు ముఖ్యఅతిథులు ఫోరం సేవలను కొనియాడారు. టీడీపీ ఎలాంటి పిలుపునిచ్చినా, పార్టీకి ఎలాంటి అవసరమొచ్చినా బెంగళూరు టీడీపీ ఫోరం అందరికంటే ముందుగా స్పందిస్తుందని ప్రశంసించారు. ఐటీ ఉద్యోగాలు చేసుకుంటూ పొరుగు రాష్ట్రం లో ఉన్నప్పటికీ సొంత రాష్ట్రంపై మమకారంతో పార్టీ అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని బలంగా నమ్మి సేవలందిస్తున్నారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఓటర్ల నమోదు నుంచి నియోజకవర్గాల్లో ప్రచారం చేయడం, బెంగళూరులో నివసించే తెలుగు ప్రజలను సొంత గ్రామాలకు తీసుకెళ్లి ఓట్లు వేసేలా కృషిచేసిన ఫోరం ప్రతినిధులకు నాయకులు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింతగా సేవ లందించేలా ఫోరం కృషిచేయాలని, అవసరమైన సహాయం అందించేందుకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

**సీబీఎన్ 29, ఎన్‌బీకే 50 సంబరాలు**

చంద్రబాబు ముఖ్యమంత్రి అయి 29 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీడీపీ ఫోరంలో 11 సంవత్సరాలుగా సేవలందించిన వారిని సత్కరించారు. ఫోరంలోని పార్లమెంటు, ఏరియా బాధ్యులను సన్మానించారు. నందమూరి బాలకృష్ణ సినీ పరిశ్రమలోకి ప్రవేశించి 50 ఏళ్లు కావడంతో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మంత్రితో పాటు ఎమ్మెల్సీలను, ఎమ్మెల్యేలను ఫోరం సభ్యులు సత్కరించారు. సభకు బెంగళూరులో నివసిస్తున్న వేలాది మంది తెలుగు ప్రజలు హాజర య్యారు. ఫోరం వ్యవస్థాపకులు కనకమేడల వీరా, శివ, కేశవ్, వంశీ, విజయ్, విష్ణు, రత్నం, పవన్, నారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



# వరద బాధితులకు అండగా నిలవండి

◆ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు

◆కరకట్టపై పర్యటించిన ఎమ్మెల్యే



విజయవాడ (చైతన్యరథం): ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానదికి పోటెత్తిన వరద నీటి ప్రవాహంతో కృష్ణలంక కరకట్ట వెంబడి ప్రాంతాలు ముంపుకు గురయ్యాయని ముంపు కారణంగా ఇబ్బంది పడుతున్న వరద బాధితులకు పార్టీ శ్రేణులు అండగా ఉండాలని శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం తెల్లవారు జామున 4 గంటల నుంచి రామలింగేశ్వనగర్, కళానగర్, భూపేష్ గుప్తానగర్, రాణిగారితోట, తారకరామానగర్, కృష్ణలంక వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. వరద తీవ్రత పెరుగుతున్నందున ప్రజలంతా కూడా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని, పునరావాస కేంద్రాలకు చేరుకుంటే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ప్రతి వీధి వీధికి వెళ్ళి ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే పార్టీ శ్రేణులు, స్వచ్ఛంధ సంస్థల వారు, యువకులు ఇది ఒక యుద్ధంగా భావించి వరద బాధితులకు సేవచేయడంలో, వారిని సురక్షిత ప్రాంతాలకు చేరవేయడంలో, అక్కడక్కడ ఇసుక బస్తాలతో వరదను కట్టడి చేసే కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని బాధితులకు అండగా నిలవాలన్నారు. అర్థరాత్రి అపరాత్రి అని తేడాలేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరద ప్రాంతాల్లో పర్యటించి అధికారులను పరుగుపెట్టించి ప్రజలకు పాలు, ఆహారం అందిస్తున్నారన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా చేయని విధంగా చంద్రబాబు నాయుడు ప్రజల మధ్యే ఉంటూ వారికి మనోధైర్యాన్ని కల్పిస్తున్నారని, నాయకుడు అంటే ఎలా ఉండాలో అనేది నేర్చుకునేలా 74 సంవత్సరాల వయస్సులో కూడా ఎక్కడా రాజీపడకుండా విశ్రాంతి లేకుండా చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు, తూర్పు నియోజకవర్గంలో గద్దె క్రాంతి నేతృత్వంలో కొందరు యువకులు ఒక టీమ్‌గా ఏర్పడి రేయింబవళ్లు వరద బాధితులకు సేవలందిస్తున్నారన్నారు.



## వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట (చైతన్యరథం): వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సోమవారం పర్యటించారు. పెనుగంచిప్రోలు మున్నేరు బ్రిడ్జి వద్ద వరద పరిస్థితిని, చెరువు కట్ట వద్ద, ముళ్ళపాడు రోడ్డు కల్వర్టు, ముచ్చింతల రోడ్డుకు ఏర్పడిన గండికి సంబంధించి జరుగుతున్న పనులను పరిశీలించారు. అమ్మవారి ఆలయ ఎదురు బాగాన బోసిపేట, బంగారు కాలనీ, హరిజనవాడ, ప్రాంతాల్లో పర్యటించి స్థానికులకు మనోధైర్యం కల్పించారు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధితులకు భరోసానిచ్చారు. అమ్మవారి ఆలయ సమీపంలోని ముంపుకు గురైన బొమ్మల దుకాణాలు వరద ప్రభావం వల్ల నష్టపోయిన బాధితులు అందరిని ఆదుకుంటామని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు.

విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు డ్రోన్ల ద్వారా ఆహారం, మంచినీరు సరఫరా చేయిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా



## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ పర్యటన

పెడన (చైతన్యరథం): వరద ప్రభావిత ప్రాంతాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం పర్యటించారు. బాధితులకు అండగా ఉంటామన్న ఆయన... లోతట్టు



ప్రాంతాల్లో నిలిచిపోయిన వరద నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడాలని అధికారును ఆదేశించారు. గత శుక్రవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పెడన నియోజకవర్గ పరిధిలోని కృత్తివెన్ను మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పర్యటించారు. కృత్తివెన్ను మండలంలో డ్రైన్లు, కాలువలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టటం వలన నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి పంట పోలలోకి నీరు చేరినట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ గుర్తించి, వెంటనే ఈ ఆక్రమణలను గుర్తించి, తొలగించాలని అధికారులను ఆదేశించారు.

# కోవూరును క్యాన్సర్ రహితంగా మారుద్దాం

◆విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

◆ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు నగర శివార్లలోని విపిఆర్ కన్వెన్షన్ లో వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఆషా వర్కర్లు మరియు ఆరోగ్య కార్యకర్తలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. విపిఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోవూరు నియోజకవర్గ పరిధిలోని దాదాపు అయిదు వందలకు పైగా ఆషా వర్కర్లు మరియు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ వ్యాధి నూటికి నూరు శాతం నయం అవుతుందాన్నారు. క్యాన్సర్ గురించి ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలందించే ఆషా వర్కర్లు మరియు ఆరోగ్య కార్యకర్తలు చొరవ తీసుకొని గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఇటీవల తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌కు యిచ్చిన క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ యూనిట్ ద్వారా ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

అనంతరం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... ఎక్కువగా మహిళలే క్యాన్సర్ బారిన పడుతుంటారని తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా చాలా మంది అడ్వాన్స్ స్టేజ్ క్యాన్సర్ బాధిత మహిళల దయనీయ పరిస్థితి చూసాక కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించుకున్నానన్నారు. ఓ మహిళగా తన విజయం కోసం పాటు పడిన మహిళలకు ఆదుకోవాలన్న మానవతా ధృక్పథంతో ఈ కార్యక్రమం తలపెట్టానన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా తాము స్విమ్స్ హాస్పిటల్ కు యిచ్చిన బస్సులో బ్రెస్ట్ క్యాన్సర్, స్యూట్రస్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ కు సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహిస్తా మన్నారు. నలభై అయిదు రోజుల పాటు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించే పింక్ బస్సు గ్రామాలలో పర్యటిస్తుందని ఈ సౌకర్యాన్ని కోవూరు నియోజకవర్గ సోదరీమణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్విమ్స్ కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత్, డాక్టర్ చంద్ర భాను, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హేమలత డిప్యూటీ డిఎం హెచ్ డాక్టర్ బ్రిజిత డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు అండగా టీడీపీ నేత వర్మ

◆పిఠాపురం నుంచి రూ.2 లక్షల విలువ చేసే 5 టన్నుల కూరగాయల పంపిణీ

పిఠాపురం (చైతన్యరథం) : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ వర్మ ముందుకొచ్చారు. తన సొంత నిధులతో సుమారు రూ.2 లక్షల విలువ చేసే 5 టన్నుల కూరగాయలు సేకరించి విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ... కృష్ణానదికి గతంలో ఎన్నడూ లేనంతగా వరద తాకిడి వచ్చిందని, విజయవాడ చుట్టూ ఉన్న వాగులు ప్రమాదకర స్థాయి దాటి ప్రవహించడంతో విజయవాడ నగరం ముంపునకు గురైందన్నారు. వరదల కారణంగా విజయవాడలోని పలు కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి ఇబ్బందులను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత రెండు



రోజులుగా కంటి మీద కునుకు లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. అర్థరాత్రి సైతం బాధితులను ఆదుకునేందుకు సీఎం చూపించిన చొరవ మర్చిపోలేనిదన్నారు. పదవి అంటే అధికారం కాదు... భాధ్యత అని భావించే నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. 1996లో కోనసీమ తుఫాన్ సంభవించినప్పుడు రాజమండ్రి కేంద్రంగా చంద్రబాబు సమీక్షించి పనులు చేపట్టారని, హుద్ హుద్ తుఫాన్ సమయంలో వారం రోజుల పాటు బస్సులోనే పడుకుని విశాఖను యథాస్థితికి తీసుకొచ్చారని అన్నారు. ప్రజల ప్రాణాలే ముఖ్యమని భావించిన చంద్రబాబు పడవపై ప్రయాణించి అక్కడి పరిస్థితులను తెలుసుకుని బాధితులకు అండగా నిలుస్తున్నారని ప్రజల కోసం చంద్రబాబు పడుతున్న తపన చూసి ప్రతిఒక్కరూ కొనియాడుతున్నారని అన్నారు. ఆ భగవంతుడు చంద్రబాబుకి ఆయుఅరోగ్యాలు కల్పించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సకుమళ్ళ గంగాధర్ రావు, గుండ్ర సుబ్బారావు, అనిశెట్టి సత్యానంద రెడ్డి, సోము సత్యనారయణ, పిల్లి చిన్న, కోరుప్రోలు శ్రీనివాస్, నల్లా శ్రీను, సురవరపు సుబ్బారావు, ఆలం దొరబాబు, కోడిగుడ్ల పెద్దబాబు, కౌన్సిలర్ బంగారు బాబు, నెక్కల సత్యనారాయణ, అద్దూరి శ్రీను, నల్లా గోవిందు, కర్నాసుల రాజా, దుర్గాడ విజయ లక్ష్మి, పొన్నాడ గంగ భావాన్ని దాసం ప్రసాద్, గుత్తుల రామకృష్ణ, వరద సత్తిబాబు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చైతన్యరథం

# అలుపెరగని ప్రజా సేవకుడు చంద్రబాబునాయుడు

◆వరద ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన

◆వరద బాధితులకు నేనున్నానంటూ భరోసా

◆70 ఏళ్లు పైబడిన వయస్సులోనూ ప్రజల కోసం తపన

◆ ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ ప్రశంస

ఒంగోలు, చైతన్యరథం: భారీ వర్షాలతో గతంలో ఎన్నడూ లేనంతగా విజయవాడ నగరాన్ని వరదనీరు ముంచెత్తిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిద్రాహారాలు మాని శ్రమిస్తున్న తీరు నాయకులు, కార్యకర్తల్లో స్ఫూర్తి నింపుతున్నదని ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్ధరాత్రి సమయంలోనూ చంద్రబాబు వరద ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు సహాయ, సహకారాలు అందిస్తున్నారని అన్నారు. వరదనీరు పూర్తిగా తగ్గేవరకు విజయవాడ నుంచి కదలనని చెప్పడం ప్రజల్లో ధైర్యాన్ని నింపిందని తెలిపారు. 70 ఏళ్ళు పైబడిన వయస్సులోనూ చంద్రబాబు ప్రజల కోసం అలుపెరగకుండా రాత్రింబవళ్లు పనిచేయడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతున్నదన్నారు.

ప్రజలు వరద నీటిలో చిక్కుకుని ఆకలితో అలమటిస్తుంటే చంద్రబాబు పడవలో స్వయంగా వెళ్లి భోజనం ప్యాకెట్లు అందించారని తెలిపారు. లక్షన్నర మందికి భోజనం తయారుచేయించి ప్రజల ఆకలి తీరుస్తున్నారన్నారు. ఊహించని వరద విజయవాడ



ప్రజలను అతలాకుతలం చేసిందని, ఈ సమయంలో అండగా ఉండాలనే ఉద్దేశంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేయడంతో పాటు వారి అవసరాలు తీర్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

వైసీపీ హయాంలో వరదలు వచ్చినప్పుడు జగన్ తాడేపల్లి ప్యాలెస్ దాటి బయటకు వచ్చిన పాపాన పోలేదని, ప్రజలను మీ చావు మీరు చావండి అంటూ గాలికి వదిలేశాడని విమర్శించారు. ఇప్పుడు కూడా ప్రజలకు అండగా ఉండాల్సిన సమయంలో జగన్ చెత్త రాజకీయాలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ కుట్రలకు తెరలేపడాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు.

జిల్లా నుంచి కూడా భోజనం తయారు చేయించి విజయవాడకు తీసుకెళ్లారన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అమరావతి ప్రాంతంలో వరద నీరు నిల్వ లేకుండా చేసేందుకు చంద్రబాబు ముందుచూపుతో కొండవీటి వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించారని గుర్తు చేశారు. ఎంత వరద వచ్చినా ఆ నీటిని మోటార్ల ద్వారా కృష్ణానదిలోకి పంప్ చేయవచ్చునన్నారు. అందువల్లే ఇప్పుడు అమరావతిలో చుక్కనీరు కూడా నిల్వ లేదనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని జగన్‌కు హితవు పలికారు.



## నిరాశ్రయులకు ఆహారం అందజేసిన ఎమ్మెల్యే వసంత

◆విజయవాడ జెఎన్ఎన్యూఆర్ఎం కాలనీలో పర్యటన

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ (చైతన్యరథం): వరద ముంపు ప్రాంతాల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు నేరుగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆహార పంపిణీ, బాధితుల తరలింపు చేపట్టి నిరాశ్రయులకు నేనున్నా అంటూ భరోసా ఇస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తిగా సహాయ కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు. విజయవాడలో జక్కంపూడి జెఎన్ఎన్యూఆర్ఎం కాలనీలో సోమవారం వరద బాధితులకు, నిరాశ్రయులకు ఆహారం, తాగునీరు, పాలు, బిస్కెట్లను స్వయంగా అందజేశారు. మూడు పూటలా బాధితులకు ఆహారం అందించే విధంగా చర్యలు చేపట్టారు. చిన్నారులు, గర్భిణులను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టారు. ఒకే ప్రాంతంలో కాకుండా మారుమూల ప్రాంతాలకు కూడా లోడర్ లో వెళ్ళి ఆహారాన్ని అందజేశారు. వరద సహాయక చర్యల్లో నేరుగా పాల్గొంటూ అందరిలో స్ఫూర్తి నింపుతున్నారు.

## మత్స్యకారులకు శాశ్వత పరిష్కారం చూపుతాం

□పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే యరపతినేని



గురజాల (చైతన్యరథం): గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదిలో భారీగా వరద నీరు చేరి మత్స్యకారుల ఇళ్ళు ముంపు గురయ్యాయి. నియోజకవర్గంలోని రామాపురం వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. బాధితులైన మత్స్యకారులను పరామర్శించిన ఆయన... అనంతరం నదీపరివాహక ప్రాంతానికి వెళ్లి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. మత్స్యకారులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఈ సందర్భంగా యరపతినేని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ముంపు బాధితులకు నిత్యవసర సరుకులు అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరద నీరు తగ్గేంతవరకు అధికారులు పర్యవేక్షణలో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

## సత్ఫలితాలు ఇస్తున్న నీరు-చెట్టు చెక్‌డ్యామ్‌లు

◆రంగన్నగూడెంలో చెక్‌డ్యామ్‌లపై వరద నీరు పరిశీలించిన టీడీపీ నేతలు

గన్నవరం (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దశా - దిశా నిర్దేశ్యంలో గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో నీరు - చెట్టు పథకంలో చేపట్టిన చెక్ డ్యామ్ లో రైతులకు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో మల్లవల్లి నుంచి సింగన్నగూడెం, రంగన్నగూడెం మీదుగా వీరవల్లి పెద్దచెరువుకు వచ్చే వెట్టివాగు పొంగి భారీగా వరద నీరు కిందకి వస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం రంగన్నగూడెం గ్రామంలో గత తెలుగుదేశం ప్రభుత్వం 2018లో రంగన్నగూడెం గ్రామంలోని వెట్టివాగు మీద నిర్మించిన చెక్ డ్యాంలపై కిందకు పారుతున్న వరద నీరును స్థానిక రైతులతో కలిసి సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు పరిశీలించి వారి పని తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2015-2019లో గత తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సూచనలతో వృథాగా పోయే వరద జలాలను సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్రవ్యాప్తంగా నీరు - ప్రగతి కార్యక్రమంలో నీరు - చెట్టు పథకంలో 8000 చెక్ డ్యాంలు నిర్మించడం జరిగిందని, దీని వలన రాష్ట్ర వ్యాప్తంగా 90 టీఎంసీలు భూగర్భ జలాలు అదనంగా స్థిరీకరించబడి రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఉమ్మడి



కృష్ణ జిల్లాల్లో 8 టీఎంసీలు భూగర్భ జలాలు అదనంగా స్థిరీకరణ జరిగిందని రంగన్నగూడెంలో ఈ చెక్ డ్యాంల వలన ప్రస్తుతం ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు 30 అడుగులు పైకి వచ్చి రైతుల గొట్టపు బావులకు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చాయని వీటి వలన రంగన్నగూడెం, వీరవల్లి గ్రామంలో 200 సబ్మెరిసబుల్ గొట్టపు బావులు వినియోగించే రైతులకు 3కిలోమీటర్ల మేర జరిగిందని ఈ చెక్ డ్యామ్ లో నుంచి రెండు పక్కల 100 ఎకరాల రైతులు ఆరుతడి పంటలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ చెక్ డ్యామ్‌లో లబ్ధిదారులు, రైతు ప్రముఖులు కసుకుర్తి అర్జునరావు గొలుసు సత్యనారాయణ మొవ్వ తాతారావు కనకవల్లి యాకోబు, ఆళ్ళ సుధాకర్, జాలిపత్తి పూర్ణచంద్రరావు, కసిగుర్తి కృష్ణ కిషోర్, ఆళ్ళ లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

◆ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ సూచన

◆ముంపు ప్రాంతాల పరిశీలన

జగ్గయ్యపేట (చైతన్యరథం): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏపీ - తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద పాలేరు నది పొంగి ప్రవహించడంతో నదిపై నిర్మించిన బ్రిడ్జి కోతకు గురై కొట్టుకుపోయింది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుతం రాకపోకలను నియంత్రించడం జరిగిందని, ప్రయాణాలు చేయదలచిన వారు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని కోరారు. సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలను పరిశీలించారు. చరిత్రలో కనివిని ఎరగని రీతిలో వర్షం కురిసిందని, భారీ వర్షాలకు మున్నేరు నుంచి వచ్చే వరద తోడుకావడంతో కృష్ణానదీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం వరద సహాయక చర్యలు చేట్టడంతో పాటు పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అధికారులను అప్రమత్తం చేసిందన్నారు. వరద తగ్గుముఖం పట్టగానే పంట నష్టం అంచనా వేస్తామని తెలిపారు. కోతకు గురైన రహదారులను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను రఘురామ్ కోరారు.



చైతన్యరథం

# ఆందోళన వద్దు.. అండగా ఉంటాం

◆వరద బాధితులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి భరోసా

◆వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

◆మోటార్ల సాయంతో నీళ్లు తోడాలని అధికారులకు ఆదేశాలు

గుంటూరు (చైతన్యరథం): గత శుక్రవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలైన శ్రీనివాసరావుపేట, శాంతి నగర్, లక్ష్మీనగర్, రామిరెడ్డి నగర్, 60అడుగుల రోడ్డు, గౌతమి నగర్, ముత్యాలరెడ్డి నగర్, అంబేద్కర్ నగర్, కొబాల్ట్ పేట, దేవాపురం, పట్టాభిపురం, వడ్డే గూడెం, చుట్టగుంట, కే.వి.పి కాలనీ, ఏటి అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీ, నల్లచెరువు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పర్యటించారు. భారీగా నష్టపోయిన పలు పేదల కుటుంబాలకు వ్యక్తిగతంగా 10వేలు చొప్పున ఆర్థిక సహాయంగా పలువురికి అందజేశారు. ఏటి అగ్రహారం ప్రధాన రోడ్డులో మోకాళ్ళ లోతు నీటిలో నడుస్తూ, నీళ్లు చేరిన ఇళ్లలోకి వెళ్లి ప్రజల్ని పరామర్శించారు. ఇంత భారీగా నీరు చేరటానికి ప్రణాళిక లోపమే ప్రధాన కారణమని,వెంటనే అధికారులు నీటిని తొడటానికి అవసరమయ్యిన యంత్రాలను ఉపయోగించి నీటిని తోడాలని ఆదేశించారు. దేవాపురంలో సైడు కాలువలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టటం వలన నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఇళ్లలోకి నీరు చేరినట్లు ఎమ్మెల్యే గుర్తించి,వెంటనే ఈ ఆక్రమణలను గుర్తించి,తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నల్ల చెరువులో సరయిన



డ్రైనేజీ నిర్మాణాలు లేకపోవటం వలనే ఈ పరిస్థితి వచ్చిందని,గత పాలకులు,అధికారులు ఎందుకు వీటి మీద దృష్టి పెట్టలేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి డ్రైనేజీ మరియు సిల్టేషన్ తొలగింపు మీద దృష్టి పెట్టానని, సిబ్బంది కొరత మరియు ఇతర కారణాలతో ఆశించిన స్థాయిలో పనులు జరగలేదని తానూ భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శానిటేషన్ విషయాన్ని తానూ సిరియస్ గా తీసుకుంటున్నానని, ఇప్పటికే ఈ విషయాన్ని నగర మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే తెలిపారు. గత మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అన్ని డివిజన్ లలో సైడ్ డ్రైన్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదించానని, లోతట్టు ప్రాంతాల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్లు గళ్ళా మాధవి తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను, అధికారులు అందరు సమన్వయ పరుచుకుంటూ, ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులతో తానూ ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపి, అధికారులకు ఆదేశాలు జారీ చేసానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉన్నారని ప్రజలకు భరోసానిచ్చారు.

# లోతట్టు ప్రాంతాల బాధితులకు సహాయక చర్యలు

◆సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

◆ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి

◆45వ డివిజన్‌లో నిత్యావసరాల పంపిణీ

రాజమహేంద్రవరం (చైతన్యరథం): లోతట్టు ప్రాంతాల్లోని బాధితులకు తమ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా నీట మునిగి ఇబ్బందులు పడుతున్న స్థానిక 45వ డివిజన్ ఇందిరానగర్, శ్రీలంక (రాజీవ్ నగర్) ప్రాంతాల్లోని ప్రజలను ఆయన పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు, అలాగే రాజమండ్రి పార్లమెంట్ కమిటీ కార్యనిర్వాహక



కార్యదర్శి కొయ్యల రమణ సంయుక్తంగా సమకూర్చిన నిత్యావసరాల కిట్లను సుమారు 250 కుటుంబాలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొయ్యల రమణ, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు తదితర నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల తాము, తమ ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉందన్నారు. వర్షాల కారణంగా నగరంలో నీట మునిగిన ప్రాంతాలను పర్యవేక్షించి స్థానిక ప్రజలకు కావాల్సిన సహాయక చర్యలు చేపట్టాలని ఎప్పటికప్పుడు అధికారులకు సూచిస్తున్నామన్నారు. వైరల్ ఫీవర్లు వ్యాప్తి చెందకుండా చూడాలని, ఆయా ప్రాంతాల్లో నిత్యం పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి రోజు సాయంత్రం నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించామన్నారు. వైరల్ ఫీవర్ల పట్ల ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని, కాచి చల్లార్చిన గోరు వెచ్చని నీటి మాత్రమే తాగాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో ఏ చిన్న పాటి తేడా వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గత ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు ఇటువంటి లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టకుండా అనాలోచిత పనులను చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. విజయవాడలో వరదల నేపథ్యంలో చోటు చేసుకున్న ఘటన పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. విజయవాడలో సహాయక చర్యల కోసం రాజమండ్రి నగర పాలక సంస్థ నుంచి సిబ్బంది వెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# పునరావాస కేంద్రాలకు వెళ్లండి

◆ఎం.పి కేశినేని శివనాథ్ సూచన

◆కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించిన

ఎం.పి, మంత్రి నారాయణ

విజయవాడ (చైతన్యరథం): బుడమేరు వాగుకి గండి పడటం, కృష్ణ నదికి వరద ఉధృతి పెరగడటంతో రామలింగేశ్వర నగర్ కరకట్ట ప్రాంతాన్ని, వరద ముంపుకు గురైన ఇళ్లను పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి ఎం.పి. కేశినేని శివనాథ్ సోమవారం పరిశీలించారు. వరద ముంపు ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచే మంత్రి నారాయణతో కలిసి పర్యటించారు. రామలింగేశ్వర నగర్‌లో రోడ్లపైకి చేరుతున్న కృష్ణా నది వరద ప్రాంతాలను పరిశీలించారు. ఇళ్ల మధ్యకు నీరు రాకుండా చర్యలు చేపట్టాలని వి.ఎం.సి అధికారులకు ఎం.పి. కేశినేని శివనాథ్ ఆదేశాలు ఇచ్చారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజలను పునరావస కేంద్రాలకు తక్షణం తరలించే చర్యలు మొదలు పెట్టాలని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పటంతో పాటు, అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి నారాయణతో కలిసి ఎం.పి.కేశినేని శివనాథ్ తెలిపారు.

# కరకట్ట బలోపేతానికి చర్యలు

◆టీడీపీ నేత మండలి వెంకట్రామ్

◆ముంపు ప్రాంతాల్లో యువ నేత పర్యటన



మోపిదేవి (చైతన్యరథం): మండల పరిధిలోని ఉత్తర చిరువోలు లంక వద్ద కృష్ణానది కరకట్టను నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ సోమవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో అర కిలోమీటర్ పొడవునా కరకట్ట పల్లంగా, మెతకగా ఉండడంతో పాటు కోసూరువారిపాలెం, మేళ్లమర్తిలంక, ఉత్తర చిరువోలులంక, అయోధ్య పరిధిలో 60-70 వర్షపు నీటి గండ్లు పడిన పరిసరాలను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ఇసుక మూటలతో గండ్లు పూడ్చే పనులు చేపట్టిన అధికారులతో మాట్లాడి పనులు పర్యవేక్షించారు. ఉత్తర చిరువోలులంక, అయోధ్య ఔట్ ఫాల్ స్లూయిజుల లీకుల కారణంగా ఉత్తర చిరువోలులంక నుంచి నాగాయతిప్ప వరకూ కట్ట అవతల ఉన్న పొలాల్లోకి వర్షపు నీరు చొచ్చుకుపోవటంతో అవుట్ ఫాల్ స్లూయిజులను బలోపేతం చేసేందుకు చేపట్టిన పనులు పరిశీలించారు. 52 గంటల నుంచి పదివేల ఇసుక మూటలతో గండ్లు పూడ్చే పనులు చేపట్టామని అధికారులు తెలిపారు. అర కిలోమీటర్ పొడవునా పల్లంగా ఉన్న కట్టను పటిష్టపరిచేందుకు మరొక పదివేల ఇసుక మూటలు రప్పించి కరకట్టను బలోపేతం చేస్తామని అధికారులు తెలిపారు. ఆర్ సీ డీఈ బీ.భానుబాబు, ఇరిగేషన్ బందర్ డీఈ మురళీకృష్ణ, మోపిదేవి ఆర్.సీ సెక్షన్ కే ఎస్ జనార్దన్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# బొబ్బిలి కోటలో విఘ్నేశ్వరుని మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు

విజయనగరం (చైతన్యరథం): ఉమ్మడి విజయనగరం జిల్లా, బొబ్బిలి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న రాజా వారి కోటలో స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం స్థానికులకు వినాయకుని మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని తలపెట్టకుండా ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాల్ని పూజించాలని ప్రజలకు సూచించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వస్తున్న ఆదిదేవుడు అయినటువంటి వినాయక చవితిని ఎలాంటి విఘ్నాలు లేకుండా జరుపుకోవాలని కోరారు.









వరదతో బాధితులకు బాసటగా నిలిచేందుకు విజయవాడకు చెందిన ముగ్గురు అక్కాచెల్లెల్లు ముందుకొచ్చారు. తమవంతు సాయంగా బాధితుల కోసం ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రికి అందించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న సీఎంను కలిసి విజయలక్ష్మీ, నిర్మాలాదేవి, రాణి అనే ముగ్గురు అక్కా చెల్లెళ్లు ఈ విరాళం అందించారు.



కృష్ణా వరద కారణంగా ముంపు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు చూస్తుంటే చాలా బాధగా అనిపిస్తుంది. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు సర్వశక్తులా కృషి చేస్తున్నాం. ఇటువంటి సందర్భాల్లో ప్రజల ప్రాణాలు చాలా ముఖ్యం. ఈ కష్ట సమయంలో ప్రతి ఒక్కరూ సహాయం చేయాలి. చివరి ప్రాంతాలకు ఇంకా సహాయక చర్యలు చేరలేకపోవడం బాధగా ఉంది. ఎంత ప్రయత్నించినా చివరి ప్రాంతాలకు సహాయం అందించలేకపోయాం. బాధిత ప్రజలకు ఆహారాన్ని అందించేందుకు డ్రోన్ టెక్నాలజీని వినియోగించాం. మొత్తంగా 32 డివిజన్లలో 32 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు పెట్టాం. కష్టాలనుంచి గట్టెక్కేవరకూ ప్రజలతోనే ఉంటా.









వరద బాధితులకు పంపిణీ చేయనున్న సోలార్ లాంతర్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. కృష్ణా వరదలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాల ప్రజలకోసం సోలార్ పవర్ కార్పొరేషన్ సిద్ధం చేసిన 1000 సోలార్ లాంతర్‌లను పంపిణీ చేయనున్నారు. లాంతరులో సౌరశక్తితో పాటు సాధారణ లైటింగ్ కూడా తీసుకుని లైటింగ్ ఇస్తారు. మరో 4000 సోలార్ లాంతర్లను కొనుగోలు చేసి వరద ప్రభావిత ప్రాంతాలకు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. చిత్రంలో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండి కమలాకర్ బాబు.